ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
## స్టేట్ విజన్
STATE VISION
శనివారం 15-08-2026 పేజీలు : 16

ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు..
## సీజనల్ వ్యాధులపై అవగాహన
5 పేజీలో...

## కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శ్రీకారం
4 పేజీలో...

# స్నాప్‌చాట్ మాయలో మహిళలు..
# 40 తులాల బంగారం కాజేసిన కేటుగాళ్లు



- స్నాప్‌చాట్ వేదికగా మహిళలతో పరిచయాలు
- విలాసవంతమైన కార్లతో కోటీశ్వరుడినంటూ నమ్మబలికిన నిందితుడు
- ప్రేమ, స్నేహం పేరుతో నమ్మించి బంగారు ఆభరణాల చోరీ
- ఇప్పటివరకు 20 మంది బాధితులను గుర్తించిన పోలీసులు
- 35--40 తులాల బంగారం దోచుకున్నట్లు నిందితుల అంగీకారం
- మరో కొంతమంది బాధితులు ఉండొచ్చని పోలీసుల అనుమానం

16 పేజీలో...

## జ్ఞనధార పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థుల ప్రతిభ ను గుర్తించడానికి కార్యదర్శి గురుకుల హైదరాబాద్ గారు విద్యార్థుల ద్వారా కథలు,డ్రాయింగ్స్,కవితలు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలతో ముద్రించిన జ్ఞనధార పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో తన ఛాంబర్ లో ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఆర్.సి. ఓ కళ్యాణి తదితరులు ఉన్నారు

## అడెల్లి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 58, 41 లక్షలు

సారంగాపూర్ ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అడెల్లి శ్రీ మహా పోచమ్మ అమ్మవారి ఆలయంలో నాలుగు నెలల కాలానికి సంబంధించిన హుండీ లెక్కింపు ప్రక్రియను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అధికారులు నిర్వహించారు.

?గత నాలుగు నెలలుగా వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల రూపంలో వచ్చిన హుండీల ద్వారా భారీగా ఆదాయం సమకూరింది.

ఆదాయం వివరాలు:

మొత్తం నగదు: రూ.58,41,141లక్షలు

మిశ్రమ బంగారం: 18 తులాలు

మిశ్రమ వెండి: 3.5 కిలోలు

కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కింపు:

దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, సీసీ కెమెరాల నిఘా మరియు పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ హుండీలను

10 పేజీలో...

## విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు దుర్మరణం

- గంగారం గ్రామంలో అలుముకున్న తీవ్ర విషాదం..
- కేసు నమోదు చేసిన కొయ్యూరు పోలీసులు



మల్హార్, ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : వ్యవసాయ మోటార్ వంక పైపు తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తండ్రీకొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన అత్యంత హృదయ విదారక ఘటన మల్హార్ మండలం కొండంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది.

10 పేజీలో...

# సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకోని యాజమాన్యం సమస్యల పరిష్కారంలో జాప్యం..

**సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకోని యాజమాన్యం సమస్యల పరిష్కారంలో జాప్యం..**

**- కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి.తాగునీరు, మౌలిక వసతులు,**

**- సంక్షేమ సదుపాయాలపై ఆందోళన వెంటనే చర్యలు తీసుకోవాలని కార్మికుల డిమాండ్**



భూపాలపల్లి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ) సింగరేణి సంస్థకు వెన్నెముకగా నిలుస్తూ బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూపాలపల్లి సింగరేణి పరిధిలోని గనుల్లో పనిచేస్తున్న కార్మికులు చాలా కాలంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ వాటికి శాశ్వత పరిష్కారం లభించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా గనుల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి గదులు, రక్షణ పరికరాలు, వైద్య సదుపాయాలు, రవాణా తదితర మౌలిక వసతులపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేటీకే--5 ఇంక్లైన్‌లో పర్యటించిన ప్రజాప్రతినిధులు సైతం కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని సింగరేణి అధికారులను కోరినట్లు సమాచారం.

సమస్యలు పేరుకుపోతున్నా చర్యలు కరువు.రోజువారీ విధుల్లో తీవ్ర శ్రమకు గురవుతున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో జాప్యం జరుగుతోందని కార్మిక వర్గాలు అంటున్నాయి. గనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కొన్ని చోట్ల అవసరమైన సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవనే ఆరోపణలు ఉన్నాయి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కోసం స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని కార్మికులు చెబుతున్నారు.వేతనాల, పెండింగ్ డిమాండ్లపైనా అసంతృప్తి..

సింగరేణి వ్యాప్తంగా కార్మికుల పెండింగ్ డిమాండ్లు కూడా కీలకంగా మారాయి. ముఖ్యంగా బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని సంఘాలు హెచ్చరిస్తున్నాయి. 12వ వెజ్ బోర్డు కోసం సింగరేణిలో ఆందోళనలు సింగరేణి కార్మికుల 31 డిమాండ్లపై కీలక చర్చలు.. సమస్యలు పరిష్కరించాలని

సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్.

సింగరేణి కార్మికులు కేవలం ఉత్పత్తి లక్ష్యాల సాధనకే పరిమితం కాకుండా వారి సంక్షేమం, ఆరోగ్యం, భద్రతపై కూడా యాజమాన్యం దృష్టి సారించాలని కోరుతున్నారు. కార్మికుల కుటుంబాలకు సంబంధించిన వైద్య, సంక్షేమ సదుపాయాలను కూడా మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

యాజమాన్యం స్పందించాలి.

కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సింగరేణి యాజమాన్యం భూపాలపల్లి ప్రాంతంలోని గనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తించాలని కార్మికులు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై అధికారులతో కార్మిక సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్రతి సమస్యకు గడువుతో కూడిన పరిష్కార ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు.

"బొగ్గు ఉత్పత్తిలో ముందుండాలని లక్ష్యాలు నిర్దేశించే యాజమాన్యం, ఆ ఉత్పత్తిని సాధించే కార్మికుల కనీస అవసరాలను కూడా పట్టించుకోవాలి" అని కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరిస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

## హల్ద్వాని ఘటనకు వ్యతిరేకంగా నిరసన



మందమర్రి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న ప్రదేశంలో 'శుద్ధికరణ'పేరుతో నిర్వహించిన చర్యను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామంలో వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ రెడ్డి మాట్లాడుతూ అంటరానితనం నిరోధక చట్టం కింద బాధ్యులపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరంగా ర్యాలీతో గుండె నిండా దేశభక్తి

**- దేశం కోసం ప్రాణాలర్పించిన వారి చరిత్ర చదవండి.**

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.**

**- ఇందూరులో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం..**

నిజామాబాద్ ఆగస్టు14: (విజన్ ఆంధ్ర ) నిజామాబాదులో తిరంగా ర్యాలీతో అందరి గుండె నిండా దేశభక్తి ఉప్పొంగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్ ఆర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు కేవలం స్వాతంత్ర దినోత్సవం రిపబ్లిక్ డే రోజున మాత్రమే జాతీయ జెండాలను ఆవిష్కరించే వారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు 2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. దీంతో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమం వల్ల దేశభక్తి పెంపొందడమే కాకుండా స్వాతంత్ర సమరయోధుల చరిత్ర తెలిసే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా కులం మతం ప్రాంతం అనే భేదాలు లేకుండా భారతీయుల ఐక్యత కోసం రూపొందించిన కార్యక్రమం అన్నారు యువతలో జాతీయ భావాన్ని పెంపొందించడం దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంచడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. తిరంగా ర్యాలీ అంటే చేతిలో జెండా పట్టుకొని నడవడం మాత్రమే కాదని





ప్రతి ఒక్కరి హృదయంలో దేశభక్తిని మన ఆలోచనలలో జాతీయతను చేతల్లో దేశ నిర్మాణాన్ని నింపుకోవడం అన్నారు.ఇప్పటి యువత స్వాతంత్ర సమరయోధుల పాఠాలు చదవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు. చిన్న వయసులో ప్రాణాలర్పించిన భగత్ సింగ్, ఉద్దం సింగ్, చంద్ర శేఖర్ ఆజాద్, అబ్దుల్ కలాం తదితరుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. దేశానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన ఊరుకునేది లేదన్నారు. మతాల మధ్య చిచ్చు పెడితే వదిలేది లేదన్నారు. మువ్వన్నెల జెండా ముద్దాడాలంటే అదృష్టం ఉండాలని, దేశం సురక్షితంగా ఉంటుందంటే కారణం వారి త్యాగ ఫలితమే అన్నారు. తిరంగా ర్యాలీ ఆద్యంతం హుషారుగా కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, స్వచ్ఛంద సంస్థల ప్రదినిధులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేస్తే ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు

### డాక్టర్ కాళీ ప్రసాద్ విమర్శ

హనుమకొండ జిల్లా. పరకాల. విజన్ ఆంధ్ర ఆగస్టు 14 నర్సంపేట ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసినట్లయితే రేవురి ప్రకాష్ రెడ్డి పరకాలకు ఎందుకు వచ్చినట్లని భారతీయ జనతా పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ ఖాళి ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం పరకాల పట్టణంలోని బిజెపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తాను నర్సంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసినట్లుగా చెప్పుకోవడం సరైనది కాదన్నారు. నర్సంపేట ప్రజల మనసులను గెలిచినట్లయితే పరకాల ఎమ్మెల్యేగా గతంలో హనుమకొండ ఎమ్మెల్యేగా ఎందుకు పోటీ చేసినట్లు అని ఆయన నిలదీశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నష్టపోయిన పరకాలకు ఏ విధంగా న్యాయం జరుగుతుందో ఆలోచించి ముందుకు సాగాలని ఆయన పరకాల ఎమ్మెల్యే కు హితవు పలికారు. నిజాం కాలం నుండి పరకాల అభివృద్ధి చెందడంతో పాటు తన ఉనికిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేరును సంపాదించుకుందన్నారు. పరకాలకు మెడికల్ కాలేజ్ నర్సింగ్ కాలేజ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటును చేయనట్లయితే ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని పరకాల



ప్రజలు క్షమించరన్నారు. నర్సంపేట భూపాలపల్లి జిల్లాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాలలో మెడికల్ కాలేజీలు ఇంజనీరింగ్ కాలేజీలు నర్సింగ్ కాలేజీలు నిర్మిస్తున్న పరకాలపై ఎమ్మెల్యేకు పట్టింపేదని ఆయన మండిపడ్డారు. వంద పడకల ఆసుపత్రిలో పనులు పూర్తిగా కాకుండా ప్రారంభించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీ ఇంజనీరింగ్ కాలేజీ లను పరకాలకు తెచ్చే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్న ఎమ్మెల్యే తీర్పు ఆయన మండిపడ్డారు. 2020లో జరిగే ఎన్నికలలో బిజెపి గెలిచిన అనంతరం పరకాలకు మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీ ఇంజనీరింగ్ కాలేజీలను తెస్తానన్నారు. గత వారం రోజుల క్రితం ఆసుపత్రిని సందర్శించి పనులు పూర్తికాలేదని ప్రకటించిన ఎమ్మెల్యే రేవురు ప్రకాష్ రెడ్డి ఇంతలోనే ప్రారంభించడం ఏమిటని ఆయన నిలదీశారు. నెలరోజుల వ్యవధిలో బిజెపి ప్రతినిధి బృందం ఆసుపత్రిని సందర్శిస్తుందని అక్కడ వసతులు గనుక లేనట్లయితే బిజెపి ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పోరాటం చేయడం తప్పదన్నారు. పరకాలలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ధర్మారెడ్డి చేసిన శంకుస్థాపనలు తిరిగి చేస్తూ తను ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. పరకాల ఎమ్మెల్యేగా గెలిచిన రేవూరి ప్రకాష్ రెడ్డి శంకుస్థాపనలు చేసి పనులు పూర్తిచేసిన ఏ పనైనా ఉందా అని ఆయన నిలదీశారు. అదేవిధంగా జిల్లాలో నష్టపోయిన పరకాలకు న్యాయం జరగాలంటే అమరుల జిల్లా కేంద్రంగా పరకాల ను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ , కాసం గురు ప్రసాద్ , బిజెపి ప్రధాన కార్యదర్శి ఆర్పి జయంతి లాల్ , హనుమకొండ జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణ చారి , కుక్కల విజయకుమార్ పాలకుర్తి గోపి లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదు



ముఫీనా ఫాతిమా హమీద్

హనుమకొండ జిల్లా పరకాల ఆగస్టు 14 : పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'కళ్యాణ లక్ష్మి' మరియు 'షాదీ ముబారక్' పథకాలను నిర్వీర్యం చేసేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ముఫీనా ఫాతిమా హమీద్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ?గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రభుత్వం తరపున సరైన సమయంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం, చట్టసభల్లో ఎలాంటి చట్టం లేదా నిర్దిష్ట తీర్మానం చేయకపోవడాన్ని సాకుగా చూపుతూ ఈ పథకాలను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని స్పష్టమవుతోందని ఆమె ఆరోపించారు.

?కేసీఆర్ హయాంలో ?1,00,016 (రూ. లక్షా పదహారు) సాయం అందిస్తుండటాన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకాలకు అరకొర నిధులు కేటాయిస్తూ వస్తోందని విమర్శించారు. చివరకు ఈ అద్భుతమైన సంక్షేమ పథకాలకు పూర్తిగా స్వస్తి పలకాలనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

?"పేద వర్గాల ఆడబిడ్డల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని వెంటనే మార్చుకోవాలి. కోర్టులో తగిన కౌంటర్ దాఖలు చేసి, ఈ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రతి పేద బిడ్డకు రూ. లక్షా పదహారు ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి."

# పూర్వ విద్యార్థి సేవాభావం.. పాఠశాలకు భద్రతా కవచం!

- రూ.2 లక్షలతో 20 సీసీ కెమెరాల ఏర్పాటు
- జీడిమెట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు భద్రతా భరోసా
- విద్యార్థుల రక్షణకు నిరంతర నిఘా
- పాఠశాల ఆస్తుల పరిరక్షణకు కెమెరాలు
- ప్రతి పాఠశాలలో సీసీ కెమెరాలు ఉండాలి: ఏసీపీ
- క్రాంతి కిరణ్ సేవాభావాన్ని అభినందించిన అధికారులు

జీడిమెట్ల, ఆగస్టు 14: (విజన్ ఆంధ్ర); చదువుకున్న పాఠశాలపై ఉన్న మమకారాన్ని ఓ పూర్వ విద్యార్థి సేవా కార్యక్రమం ద్వారా చాటుకున్నారు. జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భద్రత, పాఠశాల ఆస్తుల పరిరక్షణ కోసం పూర్వ విద్యార్థి ఏరోళ్ల క్రాంతి కిరణ్ సుమారు రూ.2 లక్షల సొంత నిధులతో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉండేలా వీటిని ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల సిబ్బంది, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రారంభించిన ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓ

సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేడ్చల్--పేట్‌బషీరాబాద్ ఏసీపీ శంకర్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్‌వర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై కెమెరాల సీసీటీవీ కెమెరాలు ప్రారంభించారు.

భద్రతకు ఎంతో దోహదం

ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విద్యార్థుల భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థి క్రాంతి కిరణ్ రూ.2 లక్షలతో 20 కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు నిరంతర నిఘా ఉంచేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి పాఠశాలలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఆస్తులకూ రక్షణ

ఎస్‌హెచ్‌ఓ విజయ్‌వర్ధన్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతతో పాటు పాఠశాల ఆస్తుల పరిరక్షణకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. తాను చదువుకున్న పాఠశాలకు రూ.2 లక్షల విలువైన సీసీ కెమెరాల వ్యవస్థను అందించడం ద్వారా క్రాంతి కిరణ్ సామాజిక బాధ్యతను చాటుకున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా అధికారులు, పాఠశాల సిబ్బంది ఆయనను అభినందించారు.

# పద్మనగర్‌లో సమస్యలపై సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆరా?

- ప్రజల వద్దకే అధికారులు.. వినతుల స్వీకరణ
- తాగునీరు, మురుగు పారుదలపై ప్రత్యేక దృష్టి
- సిమెంట్ రోడ్లు, పార్కుల అభివృద్ధికి వినతులు
- వీధిదీపాలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు డిమాండ్
- వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం
- దోమల నియంత్రణకు విస్తృతంగా నివారణ చర్యలు

జీడిమెట్ల, ఆగస్టు 14: (విజన్ ఆంధ్ర) ; ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన 'ఒక వార్డు--ప్రతిరోజు' కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి శుక్రవారం జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మనగర్ వార్డులో పర్యటించారు. పద్మనగర్ రింగ్‌రోడ్డులో స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

మౌలిక వసతులపై వినతులు

పద్మనగర్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను పటిష్టం చేయాలని స్థానికులు కోరారు. అవసరమైన ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించాలని, పార్కులను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మరమ్మతులకు గురైన వీధిదీపాలను వెంటనే బాగుచేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా భూగర్భ జలాలను పెంచేందుకు అవసరమైన ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని స్థానికులు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టి కాలనీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

దోమల బెడద నివారించాలి

వర్షాకాలం నేపథ్యంలో దోమల బెడద పెరగకుండా ఫాగింగ్, పిచికారీ, దోమల లార్వా నివారణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ప్రజలు కోరారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి హామీ

ప్రజలు సమర్పించిన వినతులపై కమిషనర్ డాక్టర్ జి. సృజన సానుకూలంగా స్పందించారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడమే 'ఒక వార్డు--ప్రతిరోజు' కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ డి. శంకర్ సింగ్, సహాయ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కవిత, సహాయ పోలీసు కమిషనర్ ఐ. రాణి, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్లు దుర్గాప్రసాద్, శివప్రకాష్, లావణ్య, సహాయ ఇంజినీర్ లిఖిత సేన్, హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి ఉప ప్రధాన నిర్వాహణాధికారి ప్రసాద్‌రావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ

జన్నారం, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు.జన్నారం మండలంలోని లోత్రోర్రే గ్రామంలో వున్న ఎంపిపిఎస్ పాఠశాలలో శుక్రవా రంరోజున ప్రభుత్వం ఉచితంగా అందించే నాణ్య మైన బూట్లు,సాక్సులు, టై, బెల్ట్ లతో పాటు ఏక రూప దుస్తులను స్థానిక సర్పంచ్ బోడ శంకర్ నా యక్ విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌక ర్యాలతో విద్యనభ్యసించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కిట్లను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ మండాడి నరేశ్వర్, పాఠశాల ఉ పాధ్యాయులు స్పందన, కుమారస్వామి, అంగన్వా డీ టీచర్ బోడ కవిత, లోత్రోర్రే గ్రామపంచాయతీ కార్యదర్శి రాయిసిడం జక్కు గ్రామ పెద్ద కుర్సెంగా గంగారాం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల కొరడా...

## 4ట్రాక్టర్లు, 2టాటా ఏస్ వాహనాలు పట్టివేత..



బోధన్, ఆగస్టు 14(విజన్ ఆంధ్ర) : బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలూర మండలంలోని తగ్గేల్లీ గ్రామ శివారు మంజీరా నది నుండి శుక్రవారం ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లను బోధన్ రూరల్ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. మందర్న గ్రామ శివారు మంజీరా నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 1 ట్రాక్టర్, 2 టాటా ఏస్ వాహనాలను పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీరా నది, వాగుల నుండి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకై కృషి చేయాలి

## - ఆర్కేపీ ఎస్సై జాడి శ్రీధర్

మందమర్రి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : పట్టణంలో మాదకద్రవ్యాల నిర్మూలనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్,గద్దె రాగడి ఏరియాలో నార్కోటిక్ డాగ్ సహాయంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి సేవించిన,సాగు చేసిన,అమ్మకాలు చేపట్టిన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై వెంట డాగ్ హ్యాండ్లర్ వేణు గోపాల్, సిబ్బంది ఉన్నారు.



# కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శ్రీకారం




కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శ్రీకారం
పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలకు బాటలు
సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ
తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ
ఆధునిక వసతులతో బహుళ అంతస్తుల గృహ సముదాయాలు
అర్హులైన కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే లక్ష్యం
కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
భారీగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మరో కీలక అడుగు పడింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులకు శుక్రవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. పట్టణ ప్రాంతాల్లో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ప్రాజెక్టు ఆశాకిరణంగా మారనుంది.

సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

ఇల్లు లేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ఇళ్లను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి అర్హులైన కుటుంబాలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంత గూడు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు.

ఆధునిక వసతులతో టవర్స్

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌ను ఆధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర సౌకర్యాలతో గృహ సముదాయాలను అభివృద్ధి చేయనున్నారు.

కూన శ్రీశైలం గౌడ్ హాజరు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం పూర్తయితే అర్హులైన కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

మంత్రులు, ప్రజాప్రతినిధుల సందడి

కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పేదల జీవితాల్లో కొత్త వెలుగు

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి భూమిపూజ జరగడంతో స్థానికంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్మాణ కార్యక్రమం వేగంగా పూర్తయి అర్హులైన కుటుంబాలకు ఇళ్లను అందించాలని స్థానికులు ఆకాంక్షించారు.

# దేవాలయ భూముల కబ్జాలను అడ్డుకోండి

-రాజకీయ అండదండలతో ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ జనసేన ఫిర్యాదు
-శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
- ఆక్రమణలపై ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు వినతి
- స్థల ఆక్రమణకు భూమిపూజలు చేయడంపై జనసేన ఆగ్రహం
- ప్రభుత్వ, దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి
- నైబ్ తహసీల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందజేసిన జనసేన నేతలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో కొండపై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూములను ఆక్రమణల నుంచి పరిరక్షించాలని కోరుతూ జనసేన పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందగిరి సతీష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలయ భూముల్లో కొంతమంది వ్యక్తులు స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో స్థల ఆక్రమణలకు భూమిపూజలు సైతం నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ తరహా ఆక్రమణలను తక్షణమే అడ్డుకోకపోతే భవిష్యత్తులో ఆలయానికి సంబంధించిన విలువైన భూములు పూర్తిగా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ భూములపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నందగిరి సతీష్ అధికారులను కోరారు. ఆలయ ఆస్తులను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో నైబ్ తహసీల్దార్ సుధాకర్‌కు జనసేన నాయకులు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్కే వన్లో శ్రావణ మాస బోనాల మహోత్సవం



మందమర్రి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : శ్రావణ మాస బోనాల మహోత్సవాన్ని ఆర్కే వన్ మార్కెట్లో మొదటి శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆర్కే వన్ హనుమాన్ మందిరం నుంచి నెత్తిన బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరి స్వయంభూ పుట్టలో వెలసిన దుర్గామాత ఆలయం వద్ద సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఏర్పాటు చేసిన బోనాల మహోత్సవంలో క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి,15 వ వార్డు కౌన్సిలర్ ఆర్నె సంధ్యారాణి బోనం ఎత్తుకున్నారు. అలాగే 28 చివరి శుక్రవారం మహా హోమం,కుంకుమ పూజలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కంభగోని సుదర్శన్ గౌడ్ తెలిపారు. అదే రోజు భక్తులకు మహా అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే సంవత్సరం నాటికి ఆలయ నిర్మాణం సైతం పూర్తి చేస్తామని వారు చెపుతున్నారు.

# సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చొరవతో లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాల పంపిణీ
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఎల్ఓసీ కోసం దరఖాస్తు చేసుకోవాలి
- కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి: బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది. బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాలను శుక్రవారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందలేని అర్హులైన పేదలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగ్గురు లబ్ధిదారులకు రూ.3.95 లక్షల ఎల్ఓసీ

సీఎంఆర్ఎఫ్ ద్వారా సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్, దుండిగల్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మొత్తం రూ.3.95 లక్షల విలువైన ఎల్ఓసీలు మంజూరైనట్లు నాయకులు తెలిపారు.

సుభాష్‌నగర్ డివిజన్: సూరారం సుందర్‌నగర్‌కు చెందిన టీ. కవిత భర్త టీ. శివశంకర్‌కు రూ. 1,50,000 ఎల్ఓసీ మంజూరైంది.

కుత్బుల్లాపూర్ డివిజన్: ప్రసూననగర్ కాలనీకి చెందిన లబ్ధిదారుడికి రూ. 1,10,000 ఎల్ఓసీ మంజూరైంది.

దుండిగల్ సర్కిల్: చర్చ్‌గాగిల్లాపూర్‌కు చెందిన గాలి జీవన శిల్ప, తండ్రి గాలి రాజారెడ్డికి రూ. 1,35,000 ఎల్ఓసీ మంజూరైంది.

ఈ సందర్భంగా ఆయా డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు కిషోర్ చారి, బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, బొంబాయి శ్రీను, ఆంజనేయులు, మధుకర్ రెడ్డి, డీజే రమేష్, జయం చారి, శివ గౌడ్, దిలీప్, నర్సింహారెడ్డి, ప్రభాకర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## నిర్దవెల్లి గ్రామంలో ఘనంగా హర్ఘర్ తిరంగా యాత్ర

విజన్ ఆంధ్ర కేశంపేట 15 కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. దేశభక్తి జాతీయ సమైక్యతను చాటుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు జాతీయ జెండాలను నిర్దవెల్లి గ్రామంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని దేశాన్ని ప్రజలకు అందించారు.భారత్ మాతాకీ జై వందేమాతరం నినాదాలతో గ్రామంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

# ఆసుపత్రికి ప్రయాణ ఖర్చుల కోసం ఆర్థిక సహాయం

జన్నారం, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): ఆసుపత్రికి ప్రయాణ ఖర్చుల కోసం కాలనీ వాసులు 11 వేల ఐదువందల రూపాయల ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటారు. జన్నారం మండలంలోని మురిమడుగు గ్రామంలోని సత్యసాయి కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంతిని రాజు ఇటీవల అ నారోగ్యానికి (లీవర్ వ్యాధికి ) గురయ్యారు. రెక్క డితే డొక్కాడని పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో హైదరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ కు వెళ్ళడానికి కనీసం ప్రయాణ ఖర్చులకు కూడ డబ్బులు లేవని తెలిసి సత్యసాయి కాలనీ యూ త్, కాలనీ వాసులు తల కొంత పోగు చేసి 11 వేల ఐదువందల రూపాయలను శుక్రవారం రోజున ఆ యనకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన రాజుని దా తలు ముందుకు వచ్చి మీకు తోచినంత సాయం అందించాలని కోరారు. సహాయం చేసే వారు 7993534642 ఈ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

# కాటారంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**- 60 మీటర్ల జాతీయ జెండాతో భారీ ఊరేగింపు**

కాటారం డివిజన్ ప్రతినిధి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఇంటింటా జాతీయ జెండా ఎగరాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఊరూరా వాడవాడలా మువ్వల జెండా రెపరెపలాడుతూ భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. బీజేపీ కాటారం మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో 60 మీటర్ల భారీ త్రివర్ణ పతాకంతో కాటారం మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో సుమారు 1000 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 60 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు చేతబట్టి మండల కేంద్రం ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్ల నారాయణ రెడ్డి గార్లు హాజరైనారు, ఈసందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్ల నారాయణ రెడ్డి గార్లు ,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జాతీయ జెండా భారతదేశ సార్వభౌమత్వానికి, ఐక్యతకు, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షులు పాగె రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ



పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, బీజేపీ మండల అధ్యక్షులు రాంపెల్లి మనోజ్, మేడిపల్లి పూర్ణచందర్, బండ శ్రీకాంత్, బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షులు రఫీ, కాటారం ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు కవ్వాల చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మన భాస్కర్ రెడ్డి, ఆకుల శ్రీధర్, బండం మల్లారెడ్డి, జిల్లా నాయకులు జిలేల శ్రీశైలం, ఐలయ్య, దోలి అర్జయ్య, గంట అంకయ్య, సభవత్ నాగరాజు మండల ప్రధాన కార్యదర్శి గోగుల రాజేష్, మంత్రి సునీల్ మండల ఉప అధ్యక్షులు ఇంజమూరి సదానందం, ఫర్తి రెడ్డి హన్మయ్య, ముద్రకోళ్ల సుధాకర్, నాయకులు బొడ్డు ఆశయ్య, కేతిరి రాజయ్య, కంకణాల మల్లారెడ్డి, రాకేష్, పసుల శివ, సాయి, వేముల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కిష్టాపూర్ ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజ

**- ముద్దాపూర్ లో విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ!**

గజ్వేల్ నియోజకవర్గం, 14 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ముందుగా మండలంలోని చిన్న కిష్టాపూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక్ష శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం రూపుదిద్దుకుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. అలాగే, ముద్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ తూము శ్రీకాంత్ రెడ్డి తన స్వంత నిధులతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ డ్రెస్సులను, మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా బహుకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తూము శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ చిన్న ప్రయత్నం చేశానని అన్నారు. సర్పంచ్ చేసిన ఈ ఉదార స్వభావాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి..!!

**వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి..**

**బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..**

మరిపెడ , విజన్ ఆంధ్ర : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి సూచించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గుగులోత్ రవి,సర్పంచ్ బోడ సోమన్న, ఉప సర్పంచ్ షరీఫ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ.. పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.వైద్య




శిబిరంలో గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర, కోఆర్డినేటర్లు జజ్జూరి ఉపేంద్ర, గుగులోత్ కవిత, ఏఎన్ఎంలు అనిత,స్వప్న, గ్రామ పెద్దలు రాయల రవి, ఉషా, యాదగిరి,గ్రామ లీడర్లు సమ్మక్కఆశా వర్కర్లు మాధవి,జ్యోతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేసిన కౌన్సిలర్ శ్యామల

హనుమకొండ జిల్లా పరకాల ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : 80 వ భారత స్వాతంత్ర్య దినోత్సవంలో పురస్కరించుకొని ఈరోజు పరకాల మున్సిపల్ 02వ వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ ని పంపిణీ చేసిన వార్డు కౌన్సిలర్ శ్రీమతి లిబొచ్చు శ్యామల బాబురావులి గారు...



## ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు..

# సీజనల్ వ్యాధులపై అవగాహన

కాటారం, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాటారం గ్రామంలోని గంటగూడెం, దుబ్బగూడెం, ఏటీసీ సెంటర్‌తో పాటు కొత్తపల్లి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించి దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా శిబిరాల్లో హెచ్ఐవి/ఎయిడ్స్, లైంగిక వ్యాధులు, గనేరియా, సిఫిలిస్ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైన వారికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, మహాదేవపూర్ సివిల్ ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రుల్లో హెచ్ఐవి పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మౌనిక సూచించారు. జ్వరానికి సంబంధించిన రక్త పరీక్షలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, ఎం ఎల్ హెచ్ పీ డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రియాంక, సర్పంచులు పంతకాని సడవలి, కన్నీరు అరుణ స్వామి, ఉపసర్పంచ్ చిలుముల అశోక్, ఏఎన్ఎంలు శ్యామలత, సునీత, రజిత, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, లత, స్వరూపరాణి, సుజాత, పార్వతి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఖాళీలు పెంచాలి..

**- నిరుద్యోగులకు న్యాయం చేయాలి**

**- 20 వేల పోస్టులతో సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలి**

బెల్లంపల్లి ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లిలోని బీసీ వసతి గృహం ఆవరణలో టీవీయూవీ, జీవీఎస్ ఆధ్వర్యంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో అనేక ఉద్యోగ ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో వేలాది మంది నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నోటిఫికేషన్ల జాప్యంతో వయోపరిమితి కోల్పోయే పరిస్థితి ఏర్పడటంతోపాటు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను సమగ్రంగా గుర్తించి ఉద్యోగాల సంఖ్యను కనీసం 20 వేలకు పెంచి సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను పారదర్శకంగా ప్రకటించాలని, భవిష్యత్తులో ఏర్పడే ఖాళీలను దశలవారీగా భర్తీ చేసేందుకు స్పష్టమైన ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడటం మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 20 వేల ఉద్యోగ ఖాళీలతో సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులు, నిరుద్యోగులను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, విద్యార్థి నాయకులు అభిరామ్, సంతోష్, హరీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు సర్వేలు ఎవరికోసం

**- రంగారెడ్డి జిల్లా సంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి**



విజన్ ఆంధ్ర కేశంపేట 15 షాద్నగర్ నియోజకవర్గానికి సంబంధించి ఇటీవల వెలువడుతున్న సర్వేల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఇకనైనా అనుకోవాలని కర్రెడ్ల నరేందర్ రెడ్డి అన్నారు. అబద్ధపు సర్వేలు ఎవరికోసం ఎవరు చేయిస్తున్నారు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మేము గెలుస్తామన్న భీమాతో ఉన్నామని చెబుతున్నప్పుడు మీకు సర్వేలు ఎందుకు ఉరికే ఉనికిపాటు మీకెందుకు ప్రజల్లో ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేయడం సరికాదు నిజమైన సర్వేలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి నిర్వహిస్తే వాస్తవ పరిస్థితి ఏమిటో తెలుస్తుంది అని అన్నారు. సర్వేల్లో నిర్వహించే సంస్థలు పారదర్శకంగా వ్యవహరించాలని ప్రజల్లో ఉన్న వాస్తవ పరి స్థితులను ప్రతిబింబం సర్వేలు ఉండాలని ఆయన అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా రూపొందించే సర్వేలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. షాద్నగర్ నియోజకవర్గంలో ప్రజల సమస్యలు అభివృద్ధి అంశాలు ప్రజాభిప్రాయాలు ఆధారంగానే రాజకీయ పరిస్థితులను అంచనా వేయాలని నరేందర్ రెడ్డి సూచించారు. తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన కోరారు.

# పంటల సాగులో వైవిధ్యం పాటించాలి



బెల్లంపల్లి ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : పంటల సాగులో వైవిధ్యాన్ని పాటించి అధిక దిగుబడులతో పాటు అదనపు ఆదాయం పొందాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి ఈ.సురేఖ రైతులకు సూచించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామంలో పత్తి ఉత్పాదక మిషన్ (కాపస్ కాంతి)-2026--27లో భాగంగా పంటల సాగు విధానాల వైవిధ్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ..
మండలంలో పత్తి ఉత్పాదక మిషన్ కింద 680 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తి సాగు, క్లోజర్ స్పేసింగ్ విధానంలో సమగ్ర పత్తి యాజమాన్యం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 100 శాతం రాయితీతో పత్తి పాకెట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఒకే పంటను నిరంతరం సాగు చేయకుండా పత్తి--కంది అంతర పంట సాగు, పంటల మార్పిడి, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పత్తి--కంది అంతర పంటతో నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం మెరుగుపడుతుందని, చీడపీడలు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని వివరించారు. సమతుల్య ఎరువుల వినియోగం, నానో యూరియా, నానో డీఏపీ, సమగ్ర చీడపీడల యాజమాన్యం (ఐపీఎం), నీటి యాజమాన్య పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు.

**ఎరువుల దుకాణాల తనిఖీ**

అనంతరం కొండాపూర్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, బిల్లులు, లైసెన్స్ రికార్డులను పరిశీలించారు. నకిలీ, నాణ్యత లేని, అనుమతి లేని ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రాజా నరేందర్, సర్పంచ్ జుగునాకర్ రాధ, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, ఉప సర్పంచ్ గోపు శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి కె.నాగదీప్తి, రైతులు పాల్గొన్నారు.

# చంద్రవెల్లిలో వరి సాగుపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన



బెల్లంపల్లి ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి వ్యవసాయ శాఖ సహకారంతో ఆత్మ ఆధ్వర్యంలో మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో వరి సాగులో వెదజల్లే పద్ధతిపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్ రైతులకు నేరుగా వరి విత్తనాలను పొలంలో వెదజల్లి సాగు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చిరుముల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేరుగా వరి విత్తనాలను వెదజల్లడం ద్వారా సుమారు 20 నుంచి 35 రోజుల వరకు పంట కాలాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 20 నుంచి 30 కిలోల విత్తనం అవసరమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఇంకా వరి నారు పోయని రైతులు 125 రోజుల స్వల్పకాలిక వరి వంగడాలను ఎంపిక చేసుకుని వెదజల్లే పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. ఈ పద్ధతిలో కలుపు యాజమాన్యాన్ని సమర్థవంతంగా చేపట్టినట్లయితే సాంప్రదాయ పద్ధతులతో సమానంగా మంచి దిగుబడులు పొందవచ్చని, కూలీల ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని అధికారులు వివరించారు.
కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి చొప్పదండి తిరుపతి, రైతులు మహమ్మద్ రియాజ్, జంగపల్లి లక్ష్మీనారాయణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# హామీలు కాదు... స్కాలర్‌షిప్‌లు కావాలి ఫీజు రీయింబర్స్‌మెంట్ కావాలి:

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):
విద్యార్థుల భవిష్యత్తును సంక్షోభంలోకి నెట్టివేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ.10,814 కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
విద్య హక్కుగా ఉండాల్సిన సమయంలో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులు కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడటం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు కళాశాలల యాజమాన్యాల ఒత్తిళ్లు, వేధింపులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
అలాగే విద్యార్థి వ్యతిరేకమైన జీఓ నంబర్ 7, 8, 9 మరియు డీటీబీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగా అనేక కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు, మెమోలు నిలిపివేస్తున్నాయని, దీనివల్ల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయరాదని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం విద్యార్థులను వేధిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ప్రభుత్వ డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి ప్రజా విద్యను బలోపేతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, జిల్లా నాయకులు శ్యామ్, సంయుక్త కార్యదర్శి అరుణ్, జిల్లా కమిటీ సభ్యుడు సాయిచరణ్, నాయకులు కౌశిక్, భరత్, బాలు, వినయ్, కర్ణాకర్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దవెల్లిలో నూతన విద్యుత్ లైనుకు శ్రీకారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పనులు ప్రారంభం

విజన్ ఆంధ్ర కేశంపేట 15 మండల పరిధిలోని నిర్దావెల్లి గ్రామంలో2.3వ వార్డు లో ప్రజలకు విద్యుత్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించే దిశగా నూతన విద్యుత్ లైను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామంలో విద్యుత్ సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు నూతన లైను ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామంలోని పలు ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ సౌకర్యాలు మెరుగుదాలతో గ్రామ ప్రజలకు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానికులు పేర్కొన్నారు నూతన విద్యుత్తు లైను పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ప్రజలకు



అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ తెలిపారు గ్రామంలోని మిగిలిన విద్యుత్ సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిన్నయ్య రిజ్వాన వేగం నాయకులు మల్లయ్య ముత్యాలు ఉమాపతి లైన్మెన్ లక్ష్మయ్య నరసింహ యాదయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

మందమర్రి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : జాతీయ జెండాలతో రామకృష్ణాపూర్ భారతీయ జనతా పార్టీ నాయకులు పుర విధుల్లో శుక్రవారం ర్యాలీ తీశారు. స్థానిక సూపర్ బజార్ చౌరస్తా నుంచి మొదలైన ర్యాలీ రాజీవ్ చౌక్,బీజోన్ మీదుగా రామాలయం వరకు చేపట్టారు. అనంతరం జాతీయ జెండా విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ దన్ సింగ్ సీనియర్ నాయకులు డివి దీక్షితులు,పోషం,వేణుగోపాల్,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ఎరువుల డీలర్లపై కఠిన చర్యలు

**- మండల వ్యవసాయ అధికారి బి. శ్రీజ**

మల్లూర్, ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : రైతులకు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బి. శ్రీజ హెచ్చరించారు. శుక్రవారం కొయ్యూరు రైతు వేదికలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20 నుండి జిల్లాలో ఎఫ్ ఎఫ్ యస్ సెంట్రల్ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి రానుందని, ఇకపై అన్ని ఎరువుల విక్రయాలు ఈ యాప్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ బోనస్ వర్తించాలంటే రైతులు కొన్న 7 రకాల వరి విత్తనాల వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. డీలర్లు తమ లైసెన్స్‌ను దుకాణంలో ప్రదర్శించాలని, అనుమతి ఉన్న గోదాముల్లోనే సరుకు నిల్వ చేయాలని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను వ్యవసాయ అధికారితో సర్టిఫై చేయించాలని, రైతులకు రసీదు లేకుండా విక్రయాలు చేయవద్దన్నారు. ఎరువులు, విత్తనాలను లూజ్ గా అమ్మకుండా, కేవలం ప్యాకెట్ల రూపంలోనే ఈ-పోస్ (వ్యాశీూ) మెషిన్ ద్వారా ఆధార్ వేలిముద్రతో విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని ఎస్ అనూష, డీలర్లు పాల్గొన్నారు.

## నిర్దవెల్లిలో నూతన విద్యుత్ లైనుకు శ్రీకారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పనులు ప్రారంభం

విజన్ ఆంధ్ర కేశంపేట 15 మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో రెండు మూడవ వార్డు ప్రజలకు విద్యుత్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించే దిశగా నూతన విద్యుత్ లైను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామంలో విద్యుత్ సౌకర్యాన్ని మరింత మరుగుపరిచేందుకు నూతన లైను ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ నూతన విద్యుత్తు లైను ఏర్పాటుతో విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామంలోని ప్రాంతాలకు మరుగైన విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ సౌకర్యాలు మెరుగుదలతో గ్రామ ప్రజలు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానికులు పేర్కొన్నారు నూతన విద్యుత్ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ తెలిపారు గ్రామంలోని మిగిలిన విద్యుత్ సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెన్నయ్య రిజ్వాన వేగం నాయకులు మల్లయ్య ముత్యాలు ఉమాపతి లైన్మెన్ లక్ష్మయ్య నరసింహ యాదయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవ దృక్పతం అలవర్చుకోవాలి

**- మానవసేవ చేస్తే మాధవ సేవ చేసినట్లే.**

**- కాంగ్రెస్ పార్టీ అంటే కష్టంలో.. ఆపదలో చెయ్యి అందించే పార్టీ**

**- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**- నందిగామలో టైలర్ షాపు ప్రారంభించిన ఎమ్మెల్యే.**

**- బతుకు దారి చూపిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటా...**

**టైలర్ సంపత్**



నందిగామ:ఆగస్టు 14(విజన్ ఆంధ్ర న్యూస్) ; ప్రతి ఒక్కరూ సేవ దృక్పతం అలవర్చుకోవాలని, మానవసేవ చేస్తే మాధవ సేవ చేసినట్లేనని, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో గత రెండు నెలల క్రితం విద్యుత్ ప్రమాదంలో నష్టపోయి నిరాశ్రయుడైన నందిగామ గ్రామానికి చెందిన టైలర్ సంపత్ దాతల సహకారంతో ఏర్పాటుచేసిన టైలర్ షాపును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంలో నష్టపోయిన సంపత్ - శోభ కుటుంబానికి చెయ్యి అందించి ఆదుకున్న ప్రతి ఒక్కరిని అభినందించారు. ప్రస్తుత సమాజంలో యువత ఆపదలో ఉన్నవారికి సేవ చేసే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. నిరుద్యోగ యువతి యువకులు స్వశక్తిపై ఎదగడానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలు స్వయం స్వాలంబన దిశగా పయనించడానికి త్వరలోనే కుట్టు మిషన్లు సబ్సిడీ రూపంలో ఇవ్వడానికి సంసిద్ధంగా ఉందన్నారు. టైలర్ షాప్ యజమాని సంపత్ మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న తమకు ఆసరాగా నిలిచి తమ కుటుంబానికి ఉపాధి కల్పించి కొత్త జీవితాన్నిచ్చిన మానవతామూర్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లి కుమారస్వామి గౌడ్,మాజీ అధ్యక్షుడు జంగ నర్సింహ,సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్,సింగిల్ విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి,వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్ గౌడ్, శివగళ్ల సురేష్,శివగళ్ళ ప్రవీణ్, బొమ్మగళ్ళ నర్సింలు,పట్నం కృష్ణ యాదవ్, నాయకులు ఏఎంసి డైరెక్టర్ చాకలి నర్సింలు, ప్రభయ్య,జంగయ్య గౌడ్,బండారు కృష్ణారెడ్డి, చించేటి కృష్ణ గౌడ్, బి.కృష్ణ యాదవ్,పిట్టల రాములు,అగ్గి సూరేష్,చించేటి శివకుమార్, కేశమోని రామచంద్ర, నరేందర్ రెడ్డి,శివగళ్ల సుమన్,రహమత్ అలీ,అభిరామ్,డైరెక్టర్ అంజయ్య యాదవ్,నప్పిడి మహేష్,తడకల జంగయ్య తదితరులున్నారు.

# 3వ వార్డు సమస్యలపై కమిషనర్‌కు కౌన్సిలర్ వినతి..

బెల్లంపల్లి ఆగస్టు 14 విజన్ ఆంధ్ర :బెల్లంపల్లి పట్టణంలోని 3వ వార్డు అంబేద్కర్‌నగర్, రవీంద్రనగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కౌన్సిలర్ బెడ్డల సౌజన్య, బస్తీ ప్రజలతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులోని మూడు లైన్లలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రివేళల్లో చీకటిమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ తెలిపారు. పీరీల బంగ్లా నుంచి గాదం సంపత్ ఇంటి వరకు, గోలెం కిరణ్ ఇంటి నుంచి ముత్తె అనిల్ ఇంటి వరకు, ఆర్‌పీ ప్రమీల ఇంటి నుంచి సరస్వతి ఇంటి వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. బస్తీ ఏర్పడి సుమారు 30 ఏళ్లు గడిచినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి కారణంగా మహిళలు, పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ చైర్‌పర్సన్ దావా స్వాతి ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన కమిషనర్, చైర్‌పర్సన్ త్వరలోనే మూడు లైన్లలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కౌన్సిలర్ సౌజన్య, తెలిపారు 3వ వార్డు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ సౌజన్య, నాయకులు విజయ్‌కుమార్ పేర్కొన్నారు..

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కి ఏర్పాట్లు...

బోధన్, ఆగష్టు14 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో బోధన్ తహసీల్దార్ విఠల్ సమక్షంలో శుక్రవారం బోధన్ పట్టణంలోని రేషన్ షాప్ డీలర్లతో ఆర్డీఓ విజయకుమారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులను కార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి లబ్ధిదారులను నిజామాబాద్ లో ని భూంరెడ్డి కన్వెన్షన్ కు తీసుకుని వచ్చే మార్గ నిర్దేశకాలను జారీ చేసారు. జీపీఓ ల సమక్షంలో ఆర్ఐ, తహశీల్దార్ ల పర్యవేక్షణ లో, సర్పంచులు (రూరల్ లో) రేషన్ షాప్ డీలర్ లు కలిసి, లబ్ధిదారులను రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరు అయ్యేలా చూడాలన్నారు.



## పిట్టబొంగరంలో నూతన గ్రామ పంచాయతి ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి, ఆగష్టు 14, (విజన్ ఆంధ్ర) : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇంద్రవెల్లి మండలంలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు తో కలిసి పిట్టబొంగరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే బొజ్జు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న వివిధ శాఖల అధికారులను సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. గ్రామ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ, పెన్షన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరి యూనివర్సిటీలో ఒరియంటేషన్ పోస్టర్ ఆవిష్కరణ

**- పోస్టర్ విడుదల చేసిన హరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నర్సిరెడ్డి మాళ్లీ రెడ్డి**

నందిగామ:ఆగస్టు 14(విజన్ ఆంధ్ర న్యూస్) ; నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో గల హార్ట్ ఫుల్ నెస్ అకాడమీ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డీమ్డ్ యూనివర్సిటీ ఒరియంటేషన్ డే సందర్భంగా సోమవారం నిర్వహించే ఒరియంటేషన్ డే పోస్టర్ ను హరి యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ నర్సిరెడ్డి మాళ్లీ రెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ మాట్లాడుతూ, విద్యార్థుల మనోవికాసానికి,ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శిగా హరి యూనివర్సిటీ నిలుస్తుందని అన్నారు.నందిగామ మండలం కన్హ శాంతివనం లో అంతర్జాతీయ కార్పొరేట్ స్థాయిలో నిర్మితమైన హరి యూనివర్సిటీ లో ఈ నెల 17 వ జరిగే ఒరియెంటేషన్ డే సందర్భంగా బ్రోచర్ విడుదల చేశామన్నారు.ఈ కార్యక్రమానికి హార్ట్ ఫుల్ నెస్ దాజి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో డాక్టర్ వై.ఎన్.రెడ్డి,డాక్టర్ రామలింగారెడ్డి, పి.ఎం.రెడ్డి,డాక్టర్ కోటేశ్వర్,డాక్టర్ అలేఖ్య,డాక్టర్ శ్యాం కుమార్,మూసిని డాక్టర్ మోసిని వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



## గ్యాస్ వినియోగదారులను దోచుకుంటున్న 'శేషమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ'

**- గ్యాస్ పైప్ కొంటేనే ఈ-కేవైసీ చేస్తామంటూ బెదిరింపులు!**

గజ్వేల్, 14 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ పూర్తి చేయడానికి ఆగస్టు 16, 2026 ను చివరి గడువుగా నిర్ణయించింది. నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే లబ్ధిదారులకు అందే గ్యాస్ సబ్సిడీ నిలిచిపోయే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం వినియోగదారులు డిజిలాకర్, హెచ్‌పీ లేదా ఇండేన్ అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారా గానీ, లేదా నేరుగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఉచితంగా బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే, సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని 'శేషమా ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్' యాజమాన్యం మరియు సిబ్బంది నిబంధనలను తలకిందులు చేస్తూ వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ-కేవైసీ కోసం ఏజెన్సీకి వచ్చే వినియోగదారులతో సిబ్బంది బాధ్యతారాహిత్యంగా, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఖచ్చితంగా రూ. 200 చెల్లించి గ్యాస్ పైప్ కొనుగోలు చేస్తేనే ఈ-కేవైసీ చేస్తామని, లేకపోతే చేయమని తెగేసి చెబుతున్నారు. గజ్వేల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి స్మార్ట్‌ఫోన్ వాడకం తెలియని నిరక్షరాస్యులు, వృద్ధులు, మహిళలు ఈ-కేవైసీ కోసం ఉదయం నుంచి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు గంటల తరబడి వేచి చూస్తున్నారు. సబ్సిడీ ఎక్కడ ఆగిపోతుందోనన్న భయంతో, ఏజెన్సీ సిబ్బంది వేధింపులు తట్టుకోలేక పేద వినియోగదారులు చేసేది లేక వారు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉచితంగా కల్పించాల్సిన సేవలను ఆసరాగా చేసుకుని, సబ్సిడీ నిలిచిపోతుందనే భయాన్ని పెట్టుబడిగా మార్చుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న శేషమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీపై పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. గడువు దగ్గర పడుతున్నందున గజ్వేల్ మండల ప్రజలకు ఎలాంటి షరతులు లేకుండా, ఉచితంగా ఈ-కేవైసీ పూర్తయ్యేలా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు, వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.




## పంటల సాగులో వైవిధ్యం పాటించాలి

బెల్లంపల్లి ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : పంటల సాగులో వైవిధ్యాన్ని పాటించి అధిక దిగుబడులతో పాటు అదనపు ఆదాయం పొందాలని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి ఈ.సురేఖ రైతులకు సూచించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామంలో పత్తి ఉత్పాదక మిషన్ (కాపస్ కాంతి)–2026––27లో భాగంగా పంటల సాగు విధానాల వైవిధ్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ..
మండలంలో పత్తి ఉత్పాదక మిషన్ కింద 680 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తి సాగు, క్లోజర్ స్పేసింగ్ విధానంలో సమగ్ర పత్తి యాజమాన్యం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 100 శాతం రాయితీతో పత్తి పాకెట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు.
ఒకే పంటను నిరంతరం సాగు చేయకుండా పత్తి––కంది అంతర పంట సాగు, పంటల మార్పిడి, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పత్తి––కంది అంతర పంటతో నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం మెరుగుపడుతుందని, చీడపీడలు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని వివరించారు. సమతుల్య ఎరువుల వినియోగం, నానో యూరియా, నానో డీఏపీ, సమగ్ర చీడపీడల యాజమాన్యం (ఐపీఎం), నీటి యాజమాన్య పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు.

**ఎరువుల దుకాణాల తనిఖీ**

అనంతరం కొండాపూర్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, బిల్లులు, లైసెన్స్ రికార్డులను పరిశీలించారు. నకిలీ, నాణ్యత లేని, అనుమతి లేని ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రాజా నరేందర్, సర్పంచ్ జుగునాకర్ రాధ, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, ఉప సర్పంచ్ గోపు శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి కె.నాగదీప్తి, రైతులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్న కాంగ్రెస్ ని ప్రశ్నించకుండా రాజకీయం చేస్తున్న సిపిఐ

**సిపిఐ నాయకులు గౌరవెల్లి భూనిర్వాసితుల పేరుతో రాజకీయ డ్రామా**

**బిజెపి సిద్దిపేట జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 14 : గౌరవెల్లి భూనిర్వాసితుల పేరుతో చాడ వెంకట్‌రెడ్డి రాజకీయ డ్రామా ఆడుతున్నారని బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐ కూటమి రాష్ట్ర ప్రభుత్వంలో కొనసాగుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, అదే సమస్యలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గౌరవెల్లి భూనిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేయడం చూస్తుంటే, ప్రజల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉందా? లేక రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ఆందోళనల పేరుతో హడావుడి చేస్తున్నారా? అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోందన్నారు. భూనిర్వాసితులకు న్యాయం జరగాలన్నది అందరి ఆకాంక్ష అని, అర్హులైన ప్రతి కుటుంబానికి చట్టబద్ధంగా రావాల్సిన పరిహారం అందించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సీపీఐ నాయకులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కేవలం రాజకీయ ప్రచారానికి పరిమితం కావడం ప్రజలకు ఏమి ఉపయోగంలేదన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెబుతూ ప్రభుత్వ భూముల వద్దకు ప్రజలను తీసుకెళ్లి రాజకీయ ప్రచారం చేయడం తప్ప, వారికి శాశ్వత పరిష్కారం చూపించడంలో విఫలమయ్యారని విమర్శించారు.
భూనిర్వాసితులకు న్యాయం జరగాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి చట్టబద్ధంగా రావాల్సిన పరిహారం అందాలి. పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం పారదర్శకంగా పరిశీలించి, కాలపరిమితితో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని, ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించి భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ హెచ్చరించారు.

# మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా గ్లోరినా ఎన్నిక

**- మంత్రి పొన్నం ప్రభాకర్ కు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన గ్లోరీనా**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ మైనారిటీ కోఆప్షన్ (క్రిస్టియన్) సభ్యురాలిగా కాశా అలియాస్ మారుపాక గ్లోరినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో 14 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమె ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ప్రకటించారు. గత మే నెలలో మొత్తం నలుగురు కోఆప్షన్ సభ్యులకుగాను ముగ్గురిని ఎన్నుకోగా ఒక మైనారిటీ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక వాయిదా పడింది. కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కాశా గ్లోరినాను మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించి మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లు, మంత్రి పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వద్దేపల్లి వెంకటరమణకు గ్లోరినా కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి మైనారిటీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగులత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్య సంపత్ నాయక్, గడిపె సతీష్‌కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు ఎండీ హసన్, భూక్య సరోజన, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## వరి వద్దు ఆరుతడి పంటలే ముద్దు

హనుమకొండ, పరకాల విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 14 : వ్యవసాయ శాఖ పరకాల డివిజన్ ఆధ్వర్యంలో నాగారం గ్రామ సర్పంచి ఏరుకొండ శ్రీను రమాదేవి గారు అధ్యక్షతన గ్రామ రైతులతో ఆరుతడి పంటల మీద ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఏఈఓ పి. కాటంరాజు మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు చాలా తక్కువగా కురుస్తున్నవి. కావున బావులు, బోర్లు, చెరువులు, భూగర్భ జలాలలో నీటి శాతం చాలా తక్కువగా ఉన్నందున వరి వేసే రైతులు ఎండిపోయి రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడే ప్రమాదము ఉంది. దయచేసి వరి పంటలు వేయకుండా ఆరుతాడి పంటలు పెసర, మినుములు, శనిగలు, కంది, పొద్దుతిరుగుడు మొదలైన పంటలు సాగు చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, వార్డ్ సభ్యులు, రైతులు తిరుపతి శ్రీనివాస్, రాజు, వెంకట్ రెడ్డి అనిల్, కుమారు మొదలైన వారు పాల్గొన్నారు.

## ఈ నెల 17న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా

జన్నారం, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : ఈ నెల 17వ తేదీన జన్నారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మే ళా నిర్వహిస్తున్నట్లు శుక్రవారంరోజున ఐటీఐ ప్రి న్సిపాల్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఎంఎన్ సీ కంపెనీల్లో అప్రెంటిస్/ఉ ద్యోగ అవకాశాలు పొం దేందుకు ఇదొక అరుదైన అవకాశమని జిల్లా ప్రభు త్వ ఐటీఐ, ఏటీసీ పాస్ అవుట్ విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవా లని ఆయన సూచించారు.

## జంగిడి శ్రీనివాస్ నియామకంతో మండలంలో కాంగ్రెస్ బలోపేతం

**-గ్రామ శాఖ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మిరాజు**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించడం పట్ల హర్షం**

మల్హర్, ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : ఎడ్లపల్లి గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ అలుపెరగని సేవలను, నిరంతర కృషిని గుర్తించి వారిని మల్హర్‌రావు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఎడ్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మిరాజు హర్షం వ్యక్తం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు సరైన నాయకుడికి బాధ్యతలు అప్పగించారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎడ్లపల్లిలో డాక్టర్ లక్ష్మిరాజు ఆధ్వర్యంలో నూతన మండల అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మిరాజు మాట్లాడుతూ.. జంగిడి శ్రీనివాస్ నియామకంతో మల్హర్‌రావు మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నమ్మకం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆయన ఇలాంటి మరెన్నో ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎడ్లపల్లి గ్రామ ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, గ్రామ వార్డు సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు మరియు సీనియర్ కార్యకర్తలు పాల్గొని నూతన అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

**- పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు**

**- అవసరమైన వారికి కంటి అద్దాల పంపిణీ**

**- కేటరాక్ట్ బాధితులకు ఉచిత శస్త్రచికిత్సలు**

**- లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం: లయన్ అన్నెం కోటిరెడ్డి**

**- వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పాండురంగ నగర్ కమ్యూనిటీ హాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సాధురాం ఐ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య నిపుణులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలను గుర్తించి తగిన సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందించడంతో పాటు కంటి పొరలు (కేటరాక్ట్) పెరిగిన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించే విధంగా సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండుసార్లు ఉచిత కంటి శిబిరాలను



నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి వైద్య సేవలు అందించడం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతోందని పేర్కొన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఉచిత కంటి శిబిరాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, కేటరాక్ట్ శస్త్రచికిత్స వంటి సేవలను ఉచితంగా అందించడం ద్వారా లయన్స్ క్లబ్ సామాజిక సేవలో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ ఎల్.వీ.ఎన్. నాయుడు, సాధురాం ఐ హాస్పిటల్ సిబ్బంది యాదగిరి, వైద్య సాంకేతిక నిపుణులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

**సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విఠల్**

**సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్**

పెద్ద శంకరంపేట్, ఆగస్టు 14: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్.. తెలంగాణ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విట్టల్. బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ లు పేర్కొన్నారు.. మంగళవారం పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బిజె వైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఫీజుల బకాయి బిజెపి లడాయి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందన్నారు. విద్యార్థులకు బకాయి ఉన్న 15వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బి జె వై ఎం కన్వీనర్ సాయి పటేల్ కో కన్వీనర్ బుగుడాల కృష్ణ.. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. నాయకులు ప్రభు గౌడ్ ప్రవీణ్ సాయిరాం ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## మర్పల్లి రహదారిపై రాకపోకలకు బ్రేక్

**- రైల్వే గేట్ మూడు రోజులు మూసివేత**

మర్పల్లి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రం నుండి మోమిన్ పెట్ వెళ్లే ప్రధాన రహదారిపై ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. మర్పల్లి రైల్వే స్టేషన్ పరిధిలోని కిలోమీటర్ 35/5-6 వద్ద లెవల్ క్రాసింగ్ నంబర్ 18 వద్ద అత్యవసర రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఎల్సీ-18ను మూడు రోజుల పాటు పూర్తిగా మూసివేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. దీంతో మర్పల్లి-- మోమిన్ పేట్, బుదేరా మధ్య ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని మర్పల్లి తహసీల్దార్, పోలీస్ శాఖ, గ్రామపంచాయతీ,





## విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలి...

**- ఆర్డీఓ విజయకుమారి..**

బోధన్, ఆగస్టు14 (విజన్ ఆంధ్ర) : విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని బోధన్ ఆర్డీవో విజయ కుమారి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల ను తహసీల్దార్ విఠల్ తో కలిసి ఆర్డీఓ సందర్శించారు. విద్యార్థులకు సమకూరుస్తున్న వసతులు, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ లు, టాయిలెట్ లు, క్రీడా ప్రాంగణం మొదలగు వసతులను పరిశీలించారు. బోధనా విధానాలను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి సామర్థ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు.

## తెలంగాణ ఫిష్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన షాద్నగర్ ఎండోమెంట్ కన్వీనర్ మాజీ వైస్ ఎంపీపీ పశువుల నరసింహ యాదవ్

కేశంపేట విజన్ ఆంధ్ర 15 తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల అభివృద్ధి సంస్థ చైర్పర్సన్ సరిత తిరుపతయ్యను తెలంగాణ రాష్ట్ర పశు గ్రామీణ అభివృద్ధి సంస్థ టీఎస్ ఎల్ డి ఎ చైర్మన్ డాక్టర్ కౌశిక్ యాదవులు షాద్నగర్ ఎండోమెంట్ కన్వీనర్ మాజీ వైస్ ఎంపీపీ పశువుల నరసింహ యాదవ్ మడక వేణుగోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పశువు సంపద అభివృద్ధి గొర్రెల మేకల పెంపకం ద్వారా రైతులకు పశు పశువు పోషక అభివృద్ధి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వారు చర్చించినట్లు తెలిపారు. పశువు సంపద రంగం అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పశువు పోషకాలు అందుతున్న ప్రయోజనాలపై నాయకులు చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు పోవాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సరిత తిరుపతయ్య డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవులను పశువుల నరసింహ యాదవ్ మడక వేణుగోపాల్ అభినందించారు.

## కుల్కచర్లలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కుల్కచర్ల, ఆగస్టు, 14(విజన్ ఆంధ్ర): కుల్కచర్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ర్యాలీలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు ఈశ్వరప్ప, ప్రహ్లాద్ రావు, సర్పంచి అంజిలయ్య పాల్గొని మాట్లాడారు...దేశ భక్తి, సమైక్యతను చాటి చెప్పే విధంగా ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి ఐక్యతను చాటాలన్నారు. స్వాతంత్ర్య సమయోధుల త్యాగాలను అందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేస్తూ జాతీయ జెండాను చేతిలో పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఉప సర్పంచి విజయ్ కుమార్, నాయకులు వెంకటయ్య గౌడ్, జానకీరాం, హరిక్రిష్ణ, సురేందర్, మహిపాల్, చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు.



## కొడిపల్లి లో 200 మీటర్ల భారీ తిరంగాతో "హర్ ఘర్ తిరంగా" యాత్ర



కొడిపల్లి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : కొడిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 200 మీటర్ల భారీ తిరంగాతో "హర్ ఘర్ తిరంగా"యాత్రను శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కొడిపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్రను

జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో జరిగగా ముఖ్య అతిథితులు గా బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, కొడిపల్లి సర్పంచ్ కృష్ణ గౌడ్, తహసీల్దార్ కృష్ణ, ఎస్సై అమరేందర్ రెడ్డి, డీఎఫ్ఆర్ఓ పృథ్వీ, ఎంఈఓ బాలరాజు, హాజరు అయ్యారు. కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా 200 మీటర్ల భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేసి విద్యార్థులతో, యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, రాణి లక్ష్మీబాయి వంటి మహనీయుల త్యాగాలను ఈరోజు మనం గుర్తు చేసుకోవాలి. వారి కల భారతదేశాన్ని నిర్మించే బాధ్యత మన అందరిపై ఉంది. 200 మీటర్ల ఈ భారీ తిరంగా మన ఐక్యతకు, సమగ్రతకు, దేశభక్తికి నిదర్శనం అని అన్నారు. యువత దేశ సేవలో, దేశ నిర్మాణంలో ముందుండాలి" అని ఎమ్మార్వో, ఎస్సై, స్థానిక సర్పంచ్ పిలుపునిచ్చారు. వీరితో పాటు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లెక్చరర్ లు, మరియు బిజెపి నాయకులు, కృష్ణ పటేల్, బూరగడ్డ సర్పంచ్ శేకులు, జిల్లా నాయకులు మాణిక్య అశోక్, ఓబీసీ జిల్లా కార్యదర్శి కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు ఉప సర్పంచ్ లక్ష్మణ్, సాయి, రవి, నర్సింగ్ రావు, పోతరాజు అనిల్, రాజేష్ కొండి చందు, ప్రవీణ్ , దుర్గేందర్ , మోమిన్, కొండల్, రామ కృష్ణ, రమేష్ గౌడ్ , సాయి, నవీన్, నవీన్ గౌడ్, అక్షయ్, అఖిల్, లోకేష్, మహేందర్, గణేష్, ప్రశాంత్,

బిజెవైఎం నాయకులు లు పాల్గొన్నారు.

కార్యకర్తలు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారత్ మాతా కీ జై నినాదాలతో దేశభక్తిని చాటారు.కార్యక్రమం చివరలో జాతీయ గీతాలాపనతో ముగిసింది.

## విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు దుర్మరణం

**- గంగారం గ్రామంలో అలుముకున్న తీవ్ర విషాదం..**

**- కేసు నమోదు చేసిన కొయ్యూరు పోలీసులు**

మల్హర్, ఆగస్టు 14 విజన్ ఆంధ్ర : వ్యవసాయ మోటార్ వంక పైపు తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తండ్రీకొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన అత్యంత హృదయ విదారక ఘటన మల్హర్ మండలం కొండంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. కరెంట్ షాక్ తీవ్రతకు మృతదేహాల ముఖంపై రక్తం చిమ్మి, అక్కడికక్కడే విగతజీవులుగా పడిపోయిన తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన కట్టెకోల రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన యాదవ కులస్థుడైన కట్టెకోల బాపు (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతని కుమారుడు కట్టెకోల మనోజ్ ( 23) వృత్తి స్టూడెంట్) ఇరువురు కలిసి గురువారం ఉదయం 8 గంటల సమయంలో కొండంపేట శివారులోని తమ వ్యవసాయ భూమి వద్దకు పనుల నిమిత్తం వెళ్లారు. వ్యవసాయ పనుల అనంతరం సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చే ముందు, వ్యవసాయ బోరు విద్యుత్ మోటారుకు బిగించిన వంక పైపును తిప్పేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో దురదృష్టవశాత్తు ఇరువురిపై విద్యుత్ ప్రసారమై ఒక్కసారిగా కరెంట్ షాక్ రావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.అయితే ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, రాత్రి పనులు ముగించుకొని చుట్టాల ఇంటి వద్ద పడుకొని ఉంటారని కుటుంబ సభ్యులు భావించడంతో ఈ విషయాన్ని రాత్రి గమనించలేకపోయారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా తండ్రీకొడుకులు ఇద్దరూ మరణించి ఉండటాన్ని గుర్తించారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు ఇద్దరూ విద్యుత్ ఘాతానికి బలికావడంతో గంగారం గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నంబావిలో హోరెత్తిన 'తిరంగా' యాత్ర..!

**-పాఠశాల విద్యార్థులు, భాజపా శ్రేణుల భారీ ప్రదర్శన**

చిన్నంబావి, ఆగస్టు 14:(విజన్ ఆంధ్ర) : భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో మువ్వన్నెల పతాకాల ప్రదర్శన ఘనంగా సాగింది. స్వాతంత్ర్య స్ఫూర్తితో పాటు 'వందేమాతరం' గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ భారీ స్కూల్ విద్యార్థులతో అలాగే పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీని నిర్వహించారు.

భాజపా రాష్ట్ర నాయకుడు కురువ చిన్న మల్లయ్య ముఖ్య సమన్వయకర్తగా, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా ప్రాంగణం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఈ ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. స్థానిక వివేకానంద పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు చేతబూనిన త్రివర్ణ పతాకాలు, లైన్లలో క్రమశిక్షణగా కదులుతున్న ట్రాక్టర్ల ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" నినాదాలతో ముఖద్వారం వీధులన్నీ దేశభక్తి శబ్దాలతో మార్మోగాయి.

దేశభక్తిని పెంపొందించేందుకే..

ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర నాయకుడు కురువ చిన్న మల్లయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు భావి తరాల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకే ప్రధాని మోదీ ఈ యాత్రకు పిలుపునిచ్చారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను గౌరవప్రదంగా ఎగురవేసి వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, నాయకులు లింగస్వామి, కిరణ్, వెంకటస్వామి, గోపాల్, బాలయ్య నాయుడు, ఉపాధ్యాయులు, వివిధ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అడెల్లి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 58, 41 లక్షలు

తెరిచి లెక్కించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఈవో, కే. భూమయ్య పరిశీలకులు బి. సుదర్శన్,సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మదాయ శాఖ, ఆదిలాబాద్ ఏ. రాజేష్, ప్రజాప్రతినిధులు, అడెల్లి సర్పంచ్ డి.సాయన్న సారంగాపూర్ మార్కెట్ చేర్మెన్ అబ్దుల్ హది, అడెల్లి ఆలయ మాజీ చేర్మెన్ ఉట్ల రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాధవరావు, మాజీ మండల ఉపాధ్యక్షులు విలాస్ రావు, సిబ్బంది మరియు సేవకులు అడెల్లి, సారంగాపూర్, కౌట్ల, స్వర్ణ,జౌలి గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించిన అనంతరం ఆ మొత్తాన్ని బ్యాంకులోని ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



# వనపర్తి జిల్లా లో హర్ ఘర్ తిరంగా జెండా వితరణ కార్యక్రమం

వనపర్తి బ్యూరో ఆగస్టు 14 ( విజన్ ఆంధ్ర ):: భారత ప్రభుత్వం పిలుపు మేరకు, జిల్లా యువజన అధికారి కోట నాయక్ ఆదేశాల మేరకు మేరా యువ భారత్, మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ అఫైర్స్ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ మైదానంలో హర్ ఘర్ తిరంగా జెండా వితరణ కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో అగ్నివీర్ ట్రైనింగ్ అభ్యర్థులు, వాకర్స్ పాల్గొన్నారు. జిల్లా యూత్ కోఆర్డినేటర్ గజరాజుల తిరుమలేష్ పాల్గొని జాతీయ జెండాలను వితరణ చేశారు. తిరుమలేష్ మాట్లాడుతూ యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.

# అర్చక సంఘం గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మణ అప్ప



నిర్మల్ :ఆగష్టు 14 (విజన్ ఆంధ్ర ) : నిర్మల్‌లో నిర్వహించిన ఐఐచీ అర్చక సంఘం సమావేశంలో స్వామి లక్ష్మణ అప్పను సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అర్చక సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘం నాయకులు, సభ్యులు లక్ష్మణ అప్పను శాలువాతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# పశువులను గోశాలకు తరలింపు

మందమర్రి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : ప్రధాన రహదారులపై సంచరిస్తున్న పశువులను కట్టడి చేసేందుకు క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణ చర్యలు తీసుకున్నారు. శుక్రవారం గద్దె రాగడి,అమ్ము గార్డెన్ ఏరియాలో రహదారులపై సంచరిస్తున్న పశువులను కాసిపేట గోశాలకు తరలించారు. ఇప్పటికే పలు మార్లు పత్రిక ప్రకటనలలో చెప్పినప్పటికీ పశువుల యజమానులు వాటిని ఇండ్లలోకి తీసుకు పోక పోవడంతో తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాగా ప్రయాణికులకు,వాహన చోదకుల ప్రమాదాలకు పశువులు కారణమవుతున్న నేపథ్యంలో వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ పేర్కొన్నారు.



# ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలి

**- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపు**

**- చేవెళ్ళలో దేశభక్తి స్ఫూర్తిని చాటిన హర్ ఘర్ తిరంగా యాత్ర**

చేవెళ్ల, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్ల పట్టణంలో హర్ ఘర్ తిరంగా యాత్ర అసెంబ్లీ కన్వీనర్ టింగిరికర్ నందకిశోర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు (హర్ ఘర్ తిరంగా యాత్ర చేవెళ్ల మున్సిపల్ ఇన్చార్జి) డా. మల్గారి వైభవ్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు మున్నూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో పట్టణంలో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్రివర్ణ పతాకం దేశ గౌరవం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ప్రతి ఇంటా తిరంగా, ప్రతి గుండెలో దేశభక్తి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు పడమటి మమతా మోహన్ రెడ్డి, చేవెళ్ల కౌన్సిలర్స్ అత్తెల్లి మనీష్, అనంత్ రెడ్డి, మీనాక్షిసత్యనారాయణ, పెద్దోళ్ల దయాకర్, ఆలూర్ సర్పంచ్ భాగ్యశేఖర్ నాంచెరి సర్పంచ్ పులుమామిడి అశోక్, బీజేపీ నాయకులు గుండన్నగారి వెంకటరెడ్డి, కేశపల్లి వెంకట్ రాంరెడ్డి, అంజనేయులు గౌడ్, కుంచం శ్రీనివాస్, శర్వలింగం, మాణిక్య రెడ్డి, కిచ్చన్న గారి వెంకట్ రెడ్డి, బురాన్ విఠలయ్య, పత్తి సత్యనారాయణ, కుమార్ గౌడ్, ఇంద్రసేనరెడ్డి, అర్రపల్లి అశోక్, అల్లాడ శ్రీనివాస్ రెడ్డి, చేగురి ప్రవీణ్ రెడ్డి, పీసరి శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాసుల నాగరాజు, ఒద్దె గణేష్ , శ్రీనివాస్ రెడ్డి జయసింహ, శివ కుమార్, నగేష్, మహేందర్ , కృష్ణ రెడ్డి ,బీరప్ప, ఉమ శంకర్, రవి, తిరుపతి రెడ్డి, ప్రవీణ్ చారి , జి మధుసూదన్ రెడ్డి శ్రీకాంత్ శ్రీనివాస్ అభిలాష్, చంద్రయ్య, గోవర్ధన్, కృష్ణ, సంజీవరెడ్డి, మధుమోహన్ రెడ్డి, ధనుష్ రెడ్డి సందీప్ కృష్ణ రెడ్డి, కృష్ణ, పాగ వెంకటేష్ కేశపల్లి మహేందర్, మహేందర్, రమేష్, విసు అఖిల్, నరేష్, ఎబివిపి నాయకులు కుర్వ మహిపాల్, హరి, వివేకానంద, కళాశాల, పాఠశాలల విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భాగస్వామ్యంతో ఘనంగా తిరంగా ట్రాక్టర్ ర్యాలీ

**- మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్ నుంచి చౌటకూర్ వరకు భారీ ర్యాలీ**

చౌటకూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర):- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చౌటకూర్ మండలంలో రైతుల భాగస్వామ్యంతో తిరంగా ట్రాక్టర్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. దేశ అభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అన్నదాతలను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్ నుంచి చౌటకూర్ వరకు జాతీయ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రైతులు, బీజేపీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావనను పెంపొందించాలని పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడే సైనికులతో పాటు దేశ ప్రజలకు అన్నం అందించే రైతులు కూడా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదానికి అనుగుణంగా రైతులకు సమాజంలో తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు బొర్ర ప్రవీణ్ యాదవ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటి ప్రభు, తిరంగా ఇన్‌చార్జి కొత్తపల్లి జోష్ణ అశోక్‌తో పాటు సీనియర్ నాయకులు జగదీష్ పాటిల్, రమేష్ పాటిల్, ప్రవీణ్ ముదిరాజ్, కలాలి వినోద్ కుమార్ గౌడ్, గంధ్ల శ్రీనివాస్, సుధాకర్ గౌడ్ ,అలాగే యువమోర్చా నాయకులు ప్రవీణ్ అప్ప, ప్రభు గౌడ్, సాయి కృష్ణ, జగన్ రెడ్డి, బేగారి మాణిక్యం, కార్తీక్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, చాకలి శివకుమార్, దర్శి సాయిరామ్, నిరుడి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

చౌటకూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర):- ఎలాంటి అనుమతులు, సంబంధిత పత్రాలు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం తాడ్దన్‌పల్లి టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారి--161 పై కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపకు సంబంధించిన అనుమతి పత్రాలను పోలీసులు పరిశీలించగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని టోల్‌ప్లాజా వద్దే నిలిపివేశారు. కలపను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరి అనుమతితో చెట్లను నరికారు, ఎక్కడికి తరలిస్తున్నారనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఇదిలా ఉండగా, పుల్కల్, చౌటకూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాల శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా చెట్లను నరికి కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో కలపను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా చెట్ల నరికివేతకు



పాల్పడుతూ కలపను రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో అక్రమ కలప రవాణాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అటవీ సంపదను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జెండా పండుగకు ఏర్పాట్లు పూర్తి – సర్దార్ వలి

అనంతపురం రూరల్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): అనంతపురం రూరల్ మండలంలోని ఏ నారాయణపురం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం నేడు జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు రంగులతో ముస్తాబైనట్లు పంచాయితీ మొదటి శ్రేణి కార్యదర్శి సర్దార్ వలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. కావురం సిబ్బంది ఉదయమే కార్యాలయానికి చేరుకుని జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని కార్యదర్శి సిబ్బందిని ఆదేశించారు.

# పిఆర్టియు మండల కమిటీ ఎన్నిక

లింగాపూర్ ఆగస్టు 14(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పి ఆర్ టి యు మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు ఏద్దూరి శ్రీనివాస్,ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా యువరాజ్. ప్రధాన కార్యదర్శిగా సోహన్. అసోసియేషన్ అధ్యక్షులుగా సాయిరాం. మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలుగా ఆర్ శైలజ. ఉపాధ్యక్షులు కైలాస్. మహిళా ఉపాధ్యక్షులు విజయలక్ష్మి. మహిళా కార్యదర్శి ఆర్ ప్రీతి లను నూతనంగా ఎన్నుకున్నారు.

# రైతుల భాగస్వామ్యంతో ఘనంగా తిరంగా ట్రాక్టర్ ర్యాలీ

**– మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్ నుంచి చౌటకూర్ వరకు భారీ ర్యాలీ**

చౌటకూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర):– హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చౌటకూర్ మండలంలో రైతుల భాగస్వామ్యంతో తిరంగా ట్రాక్టర్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. దేశ అభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అన్నదాతలను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్ నుంచి చౌటకూర్ వరకు జాతీయ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రైతులు, బీజేపీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావనను పెంపొందించాలని పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడే సైనికులతో పాటు దేశ ప్రజలకు అన్నం అందించే రైతులు కూడా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదానికి అనుగుణంగా రైతులకు సమాజంలో తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు బొర్ర ప్రవీణ్ యాదవ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటి ప్రభు, తిరంగా ఇన్‌చార్జి కొత్తపల్లి జోష్ణ అశోక్‌తో పాటు సీనియర్ నాయకులు జగదీష్ పాటిల్, రమేష్ పాటిల్, ప్రవీణ్ ముదిరాజ్, కలాలి వినోద్ కుమార్ గౌడ్, గండ్ల శ్రీనివాస్, సుధాకర్ గౌడ్ ,అలాగే యువమోర్చా నాయకులు ప్రవీణ్ అప్ప, ప్రభు గౌడ్, సాయి కృష్ణ, జగన్ రెడ్డి, బేగారి మాణిక్యం, కార్తీక్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, చాకలి శివకుమార్, దర్శి సాయిరామ్, నిరుడి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# చౌటకూర్ రైతు వేదికలో పంచాయతీరాజ్ వీడియో కాన్ఫరెన్స్

**– చేయూత పెన్షన్లు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులపై అధికారుల సమీక్ష**

చౌటకూర్ ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర):– గ్రామ పంచాయతీలలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల వినియోగంపై పంచాయతీరాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. చౌటకూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రధానంగా చేయూత పెన్షన్ల పంపిణీ, కేంద్ర ఆర్థిక సంఘం (సిఎఫ్‌సి) గ్రాంట్ల వినియోగం తదితర కీలక అంశాలపై అధికారులు సమగ్ర సమీక్ష జరిపారు. గ్రామ స్థాయిలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని సూచించారు. గ్రాంట్ల వినియోగంలో పూర్తి పారదర్శకత, బాధ్యత పాటిస్తూ అభివృద్ధి పనులను



వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.అలాగే, మండల స్థాయి అధికారులు మరియు గ్రామ పంచాయతీల పాలకవర్గం పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే గ్రామీణ ప్రజలకు సేవలు వేగంగా, సమర్థంగా అందుతాయని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యం, గ్రామీణాభివృద్ధిలో పంచాయతీల పాత్ర అత్యంత కీలకమని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చౌటకూర్ ఎంపీడీఓ శంకర్, ఎంపీవో సువర్ణ, ఏపీవో రామ్మోహన్‌లతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల అవగాహన సదస్సు

చౌటకూర్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర):– సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎస్తర్, శ్రీనిధి, రితిక, ధృతి, దివ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి అలవాట్లు, క్రమశిక్షణ మరియు పర్యావరణ పరిరక్షణ తదితర కీలక అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.సదస్సులోని ప్రధాన ముఖ్యాంశాలు:

పోషకాహార ప్రాధాన్యత: ఆరోగ్యకరమైన జీవనశైలికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని విద్యార్థులు స్పష్టం చేశారు. జంక్ ఫుడ్, బయటి తినుబండారాలకు దూరంగా ఉంటూ.. ఇంట్లో వండిన తాజా, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రత & క్రమశిక్షణ: ప్రతిరోజూ వ్యక్తిగత శుభ్రత పాటించడం, సమయపాలన పాటించడం, పెద్దలను గౌరవించడం వంటి సత్ప్రవర్తనను చిన్నతనం నుంచే



అలవర్చుకోవాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. చెత్తను నిర్దేశిత డస్ట్‌బిన్‌లలోనే వేస్తూ పాఠశాల, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.చిన్నతనం నుంచే విద్యార్థుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలపై చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ బాబు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, పలు అంశాలపై తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ

నిజామాబాద్, ఆగస్టు 14(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ శుక్రవారం రోజు ఈనెల 31న నిజామాబాద్ లో పాంచజన్య సంకల్ప సభ పోస్టర్లను శుక్రవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు ఆవిష్కరించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జిల్లాకు టీఆర్ఎస్ పార్టీ చీఫ్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఈ సభకు రానున్నారని వెల్లడించారు.జిల్లా కేంద్రంలోని కలెక్టర్ గ్రౌండ్ లో జరిగే ఈ సభలో తెలంగాణ రక్షణ సేన పార్టీ తీసుకున్న 5 లక్ష్యాలను కవిత వివరిస్తారన్నారు . పార్టీ సిద్ధాంతాలను పల్లె పల్లెకు చేరువ చేయాలని కవిత ఈ సభ ద్వారా పిలుపునివ్వనున్నారని పేర్కొన్నారు.పాంచజన్య సభ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం నిజామాబాద్ లోని టిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. బహిరంగ సభను భారీ ఎత్తున విజయవంతం చేయాలని శ్రేణులకు రాష్ట్ర నాయకులు సూచించారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జిల్లాకు రానున్న కవితకు పెద్ద ఎత్తున సభ విజయవంతం చేసి ఘన స్వాగతం పలకాలని పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి అలీం తెలిపారు. నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్ లో జరిగే సభతో ప్రధాన పార్టీలకు వెన్నులో వణుకు పుట్టాలని కోరుట్ల నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్చార్జి డాక్టర్ రఘు పేర్కొన్నారు. నిజామాబాద్ లో జరిగే పాంచజన్య సభకు డాక్టర్ రఘు ను ఇన్చార్జిగా ఇప్పటికే ప్రకటించారన్నారు.ప్రతి పల్లె నుండి భారీ ఎత్తున శ్రేణులు కదలాలని టీఆర్ఎస్ నాయకులు రంగునవీన్ ఆచారి పిలుపునిచ్చారు. కవితక్క రాష్ట్రంలో అందరికి ఆడబిడ్డ అయితే నిజామాబాద్ జిల్లాకు కోడలు అని ఈ జిల్లా బిడ్డను ఆదరించి అక్కున చేర్చుకోవాలని జిల్లా



ప్రజలను ఆయన కోరారు. శ్రేణులు ఆ దిశగా నడుంబిగించి అన్ని వర్గాల ప్రజలను కదిలించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న మిలాద్ ఉన్ నబి పండుగ ఉన్నందున సభను ఈనెల 31కు మార్చినట్లు తెలిపారు.ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి నవీన్ రెడ్డి మాట్లాడుతూ వివిధ సమస్యల మీద ఇప్పటికే పార్టీ నుండి ఉద్యమాలు నిర్వహించినందున ఆ వర్గాలను కూడా సమీకరణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జి ఎం.ఎ అలీమ్, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి డా. రఘు, మహిళా నాయకురాలు విజయ లక్ష్మి,టీఆర్ఎస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి భూముల నిర్వహిస్తున్న రీ సర్వేకు ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలి - అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి భూముల రీసర్వేలో భాగంగా నిర్వహిస్తున్న రీ సర్వేకు ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.

శుక్రవారం మేడ్చల్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో మొత్తం పదకొండు గ్రామాల్లో భూభారతి భూముల రీ సర్వే జరుగుతుందని మేడ్చల్, ఘట్కేసర్, కీసర మండలాలలో 3 గ్రామాల చొప్పున, మూడుచింతల పల్లి, శామీర్ పేట్ మండలాలలో ఒక్కొక్క గ్రామం చొప్పున భూభారతి భూముల రీసర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. మేడ్చల్ మండల తహసీల్దారు భూపాల్ భూరీసర్వే వివరాలను అదనపు కలెక్టర్ కు వివరించారు.

# నిజామాబాద్ కు చేరుకున్న రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర

నిజామాబాద్ ఆగస్టు14:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ ఈరోజు రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర అధ్యక్షులు దొరాయ్ వేలు ఆధ్వర్యంలో శ్రీపెరంబదూర్ నుండి ఢిల్లీ వరకు కొనసాగే 35 వ రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర ఈ రోజు నిజామాబాద్ కు చేరుకున్న సందర్భంగా డిసిసి ఇంచార్జ్ కొడపు శరత్ కుమార్,డిసిసి కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కాంగ్రెస్ భవన్ వద్ద ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ రాజీవ్ జ్యోతి యాత్ర దేశంలో శాంతిని పెంపొందించే విధంగా 35 సంవత్సరాల క్రితం మొదలు పెట్టి ముందుకు వెళ్తుంది అని, ఆగస్టు 9 వ తేదీన క్విట్ ఇండియ మూవ్మెంట్ రోజు ప్రారంభమైన యాత్ర క్విట్ టెర్రరిస్ట్ నినాదంతో ముందుకు వెళ్తుందని, 20 ఆగస్టు రోజున డిల్లీ చేరుకుని అక్కడ ముగుస్తుంది అన్నారు.రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భక్తవత్సలం, ఏఐసీసీ కొ ఆర్డినేటర్ గన్ రాజ్,జిల్లా యూత్ అధ్యక్షులు ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్,జెండా గుడి ఛైర్మన్ లవంగ ప్రమోద్,మాజీ కార్పొరేటర్ కుద్దుస్,బంటు బలరామ్,మహిళ కాంగ్రెస్ నాయకులు పోల ఉష,అపర్ణ, ఆకుల మహేందర్,జాఫర్, రాజ్ గగన్, సుమీర్ అహ్మద్,మరియు తదితరులు పాల్గొన్నారు

# అల్విన్ కాలనీ సర్కిల్‌లో రోడ్ల గుంతల గుర్తింపు

## - మరమ్మతు పనులు వేగవంతం

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) ఆగస్టు 15: అల్విన్ కాలనీ సర్కిల్-51 పరిధిలో రహదారులను వర్షాకాల మరమ్మతు పనులను అధికారులు వేగవంతం చేశారు. శుక్రవారం వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి డిసి చాముండేశ్వరి, అధికారులు పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులను పరిశీలించి గుంతలను గుర్తించారు.ఎన్టీఆర్ నగర్‌లోని ఉషా ముళ్లపూడి ఆసుపత్రి రోడ్డులో సాయిబాబా ఆలయం ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ మ్యాన్‌హోల్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు చర్యలు చేపట్టారు. అదే ప్రాంతంలో బీటీ (బిటుమెన్) ప్యాచ్ వర్క్‌ను ప్రారంభించారు. అల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో మొత్తం 97 రోడ్ల గుంతలు మరియు 74 బీటీ ప్యాచ్‌ల అవసరాన్ని అధికారులు గుర్తించారు. డివిజన్ వారీగా హైదర్‌నగర్‌లో 20 గుంతలు, 10 ప్యాచ్‌లు, భాగ్యనగర్‌లో 18 గుంతలు, 15 ప్యాచ్‌లు, శంషిగూడలో 10 గుంతలు, 13 ప్యాచ్‌లు, అల్విన్ కాలనీలో 15



గుంతలు, 14 ప్యాచ్‌లు, వివేకానంద నగర్‌లో 16 గుంతలు, 12 ప్యాచ్‌లు, వెంకటేశ్వర నగర్‌లో 18 గుంతలు, 10 ప్యాచ్‌లను గుర్తించారు.గుర్తించిన అన్ని ప్రాంతాల్లో దశలవారీగా గుంతలు పూడ్చడం, బీటీ ప్యాచ్ వర్క్ చేపట్టడం ద్వారా రహదారులను ప్రయాణానికి అనువుగా మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తయితే వాహనదారులకు, స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుంది.

# బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం నిర్లక్ష్యం: ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

**- PVC డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో నకిలీ కార్డులకు చెక్**

**- ప్రజా సేవల్లో జవాబుదారీతనం పెంపొందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**- నిజామాబాద్ రూరల్‌లో 1.01 లక్షల మందికి స్మార్ట్ కార్డులు**

**-బీజేపీ, బిఆర్ఎస్ పై విమర్శలు**

**- దళితుల పట్ల బీజేపీ తీరు ఖండనీయం**

**- బీజేపీ రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రభావితం చేస్తోంది ఖర్గే పట్ల బీజేపీ వ్యవహారం అత్యంత దారుణం**

నిజామాబాద్ ఆగస్టు14:( విజన్ ఆంధ్ర ): నిజామాబాద్ రూరల్ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించడంతో పాటు ప్రభుత్వ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. కాగితపు రేషన్ కార్డుల స్థానంలోగాఎజ డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయడం ద్వారా నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేయడంతో పాటు, లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడారు. కొత్త లబ్ధిదారులతో సహా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1 కోటి 5 లక్షల మంది లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేపు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. భౌతిక కార్డులను డిజిటల్ సేవలతో అనుసంధానం చేయడం ద్వారా ఒకే చోట అనేక సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు.

రేషన్ కార్డుల డిజిటలైజేషన్ వల్ల నకిలీ కార్డుల నివారణ, సేవల్లో పారదర్శకత, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి చేరడం, కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే వివరించారు.

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలో 165 రేషన్ దుకాణాలు ఉన్నాయని, వాటి పరిధిలో మొత్తం 1,00,769 మంది లబ్ధిదారులు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. వీరిలో 1,00,344 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహాత్ములను ప్రతిపక్షాలు విమర్శించే స్థాయికి దిగజారారు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు సంబంధించిన సంక్షేమ వ్యవస్థలను ఆధునీకరించడంలో విఫలమైందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి విమర్శించారు. ప్రజలకు అవసరమైన సేవలను సులభతరం చేయడం కంటే రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా పేదలు, సామాన్య ప్రజల సంక్షేమంపై మాట్లాడుతున్నప్పటికీ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల విషయంలో స్పష్టమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రభావితం చేస్తున్నాయన్న ఎమ్మెల్యే.. ఇటీవల నల్సార్ యూనివర్సిటీ విద్యార్థుల పట్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు కాన్వకేషన్ కార్యక్రమానికి జజీ× ను ఆ యాజమాన్యం ఆహ్వానించగా పలువురు విద్యార్థులు దానిని తిరస్కరిస్తూ.. వర్సిటీ అధికారులకు వినతి పత్రం ఇవ్వడం తెలిసిందే .ఇందుకు ప్రధాన కారణం జజీ× నేతల పట్ల జజీ× వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా విద్యార్థులు వారి ఆహ్వానాన్ని తిరస్కరించారని పేర్కొన్నారు. ఫలితంగా విద్యార్థుల ఎన్రోల్ మెంట్ ను తీసుకోవద్దని సూచనలు చేయడం అత్యంత హేయమైన చర్య అభివర్ణించారు.

అటు కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే ఇటీవల ఉత్తరప్రదేశ్ లో ఓ ర్యాలీ నిర్వహించగా.. దాని తర్వాత బీజేపీ అనుబంధ సంస్థలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేయడాన్ని తప్పుబడుతూ.. దళితుల పట్ల బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. ఈ అంశమై పార్లమెంట్ లో ఖర్గే ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. ఇంత దారుణంగా బీజేపీ ప్రముఖ నాయకుల పట్ల వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని ఖండించారు. రాజకీయ ప్రముఖులకే ఇలా ఉంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సంక్షేమం, పారదర్శకత, డిజిటలైజేషన్, జవాబుదారీతనం దిశగా ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఎన్ని ఆర్థిక క్లిష్ట పరిస్థితులు ఉన్నా ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి రెండు జోడెద్దుల్లాగా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు.బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అనవసర రాజకీయ విమర్శలు చేయడం మానుకోవాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. గత ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల ద్వారా ప్రభుత్వ సేవలు మరింత ప్రజలకు చేరువ అవుతున్నాయని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా ఆ దిశగా మరో కీలక అడుగు పడుతోందని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, బాల్ రాజు, ప్రధాన కార్యదర్శి పోలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్ల ఎర్రన్న, ఉమ్మాజి నరేష్, రాంచందర్ గౌడ్, బోర్గం శ్రీనివాస్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికే ప్రాముఖ్యత

**- చేగూర్ సర్పంచ్ మంకల శ్రీశైలం.**

**- చేగూరులో మంచినీటి శుద్ధి కేంద్రం ప్రారంభం.**

నందిగామ:ఆగస్టు 14(విజన్ ఆంధ్ర న్యూస్): ప్రజల ఆరోగ్యానికి ప్రాముఖ్యత నిస్తు,ప్రజలకు ఆరోగ్యకరమైన మంచినీరు అందించేందుకు,పెగ సాఫ్ట్ వేర్ సంస్థ,కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సహకారంతో మంచినీటి శుద్ధి కేంద్రం ప్రారంభించమని సర్పంచ్ మంకల శ్రీశైలం అన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని

చేగూరు గ్రామంలో శుక్రవారం పెగ సాఫ్ట్ వేర్ సంస్థ, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సహకారంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ మంకాల శ్రీశైలం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పెగ ఇండియా సంస్థ ప్రతినిధులు విశ్వేశ్వరయ్య,సుయోధన,వినయ్,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవల్లి కుమారస్వామి గౌడ్,చేగూరు పీఏసీఎస్ చైర్మన్ పసుల బుచ్చయ్య,షాద్ నగర్ ఏఎంసి డైరెక్టర్ ధరూర్ సతీష్ పటేల్,ఉప సర్పంచ్ ఆవులమంద శివశంకర్,సర్పంచులు కొమ్ము కృష్ణ,గొర్లపల్లి అశోక్,బుగ్గ సాలయ్య, గోవిందు,పీఏసీఎస్ డైరెక్టర్లు అన్నారం నరసింహ, గుండాల సాములయ్య,పబ్బె శ్రీశైలం,వార్డు సభ్యులు స్వాతి సురేష్,కావలి అర్చన, భీమయ్య,ఎం.భాస్కర్,వార్డు సభ్యులు మాన్క స్వాతి సురేష్,కావలి అర్చన,భీమయ్య, మంచనపల్లి భాస్కర్,తదితరులు ఉన్నారు.

# సీఎంఆర్ ఐటీలో ఘనంగా 22వ ఓరియంటేషన్ డే

**- సీఎంఆర్ ఐటీలో ఘనంగా 22వ ఓరియంటేషన్ డే:**

**ఏఐపై పట్టు సాధించాలి: మల్లారెడ్డి**

హైదరాబాద్ ఆగస్టు 14: (మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కండ్లకోయలోని సీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీఎంఆర్ఐటీ)లో 2026--27 విద్యా సంవత్సరానికి కొత్తగా చేరిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం 22వ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు.

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, సీఎంఆర్ఐటీలో చదివిన పలువురు విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కొత్త విద్యార్థులు నాలుగేళ్లలో మంచి ప్లేస్‌మెంట్స్ సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. భవిష్యత్ ఏఐదేనని, విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలని సూచించారు.

సీఎంఆర్ గ్రూప్ సెక్రటరీ డా. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు నెలకోసారి కళాశాలకు వచ్చి పిల్లల అటెండెన్స్, అకడమిక్ పనితీరును తెలుసుకోవాలని సూచించారు. సీఈఓ అభినవ్ రెడ్డి విద్యార్థులు వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని అన్నారు.

అతిథులు ప్రతిష్ఠ శర్మ, ప్రత్యుష్ మేత,ఇన్ఫోసిస్ ఇండియా హెచ్ఆర్ హెడ్ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. సీఎంఆర్ఐటీ డైరెక్టర్ డా. జంగారెడ్డి కష్టపడి పనిచేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చని, తల్లిదండ్రులు పిల్లలను సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని అన్నారు.

ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ డా. రాధాకృష్ణ రెడ్డి విద్యార్థులు పాటించాల్సిన నియమ నిబంధనలు, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# బ్యాంకింగ్ తో పోటీ పడుతున్న తపాలా శాఖ - డివిజనల్ అధికారి

బాల్కొండ (నిజామాబాదు జిల్లా )విజన్ ఆంధ్ర (ఆర్. సి ) ఆగస్ట్ 14:-దేశ స్వతంత్ర అనంతరం తంతి తపాలా శాఖ మాత్రమే వ్యవస్థ ఉండేది తంతి అనగా టెలిగ్రాఫ్ తపాలా అనగా లెటర్లు బంధువులకు పంపడం, వచ్చిన లెటర్స్ తీసుకోవడం మాత్రమే ఉండేది.నేడు కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వ హయంలో " భారత తపాలా కార్యాలయాల వ్యవస్థను" సమూల మార్పులు చేసి బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక లావాదేవీలుకు పోటీగా నిలబడటాని కి గల కారణాలు ఏమిటని శుక్రవారం రోజు మా ప్రతి నిధి ఆర్మూర్ డివిజనల్ తపాలా శాఖ అధికారి బి కిషన్ నాయక్ వివరణ కోరగా గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం భారత ప్రభుత్వ తపాల శాఖ పెను మార్పులు తీసుకువచ్చిందని గ్రామీణ స్థాయి నుండి పట్టణ స్థాయిలో ఉన్న కోర్పొరేట్ బ్యాంక్ లతో పోటీ పాడుతుందని అన్నారు.అక్టోబర్ 1 నుంచి ఓటీపీ ఆధారిత డెలివరీ కొత్త సర్వీసు అమల్లోకి వచ్చాయని ఉత్తరం డెలివరీ సమయంలో చిరునామాదారుకి ఓటీపీ వస్తుందని ధృవీకరణ తర్వాతే పోస్టుమన్ ఉత్తరం అందజేస్తారు.బ్రిటిష్ కాలం నుంచి అమల్లో ఉన్న రిజిస్టర్ పోస్టు విధానాన్ని స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ వాల్యూయాడెడ్ సర్వీసుగా ఇది స్పీడ్ పోస్టు కిందే అందుబాటులో ఉంటుందని దేశవ్యాప్తంగా ఆన్లైన్ వ్యవస్థను,ఏకీకృత టారిఫ్‌ను రూపొందించిందని వివరించారు. తపాలా శాఖ "బల్క్ సేవలు" వినియోగించు కొనే సంస్థలకు 5% ప్రత్యేక తగ్గింపు,పోస్ట్ ఆఫీస్ లో అన్ని రకాల డిపాజిట్ల పై

ఏ జాతీయ బ్యాంకుల్లో లేని వడ్డీ రేట్లు అధికంగా ఉన్నాయని, సీనియర్ సిటిజనులకు ఎంతో ఉపయోగ పడే సేవింగ్ స్కీమ్స్ అందుబాటులో ఉన్నాయని అలాగే కిషోర్ బాలికలకు "సుకన్య సమృద్ధి యోజన పథకంలో" నెల నెల ఆర్థిక స్థోమత బట్టి డిపాజిట్ చేసుకుంటే బాలికకు వివాహ సమయానికి లక్షల్లో లాభాలు వస్తాయని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రైవేటు ప్రజానీకానికి,రూరల్పో పోస్టల్, లైఫ్ ఇన్సూరెన్స్ పథకం,అనేక ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల కంటే అత్యధికంగా లాభాలు కలిగిన ఏకైక సంస్థ "భారత తపాల శాఖ" ప్రజల ముందుకే గంగా జెల్ " కాశి, ప్రయాగా, ఋషికేష్ నదుల నీళ్లు 30/- లకే దేశంలోని అన్ని పోస్ట్ ఆఫీసుల్లో అంధుబాటులో ఉన్న యని,మిగతా వివరాలకు ఆయా గ్రామాల్లోని పోస్ట్ ఆఫీస్ లో సంప్రదించాలని ఆర్మూర్ డివిజన్ పోస్టల్ అధికారి బి.కిషన్ నాయక్ తెలియజేశారు.అలాగే బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం లో ఉప తపాలా కార్యాలయం అధికారిణి కే. శ్వేత మాట్లా డుతూ దేశ స్వాతంత్రానికి ముందు తంతి తపాలా శాఖ అంటే " బంధువుల సమాచారం కోసం ఉత్తరల ద్వారనే సమాచారాన్ని పోదేవారని భారత ప్రభుత్వం

ప్రజా సంక్షేమం కోసం ఏ జాతీయ బ్యాంకుల్లో సాధారణ ఖాతా లో వడ్డీ కంటే అధిక వడ్డీ ఇచ్చే పథకాలు అనేకంగా ఉన్నాయని, అందుకే గ్రామీణ ప్రాంతాల్లో వృధ్యాప్య, వితంతు పెన్షన్ దారులు కచ్చితంగా సేవింగ్ బ్యాంక్ ఖాతా ను తెరుస్తున్నారని ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంతంలో చదువు రాని వారికోసం "రూరల్ " పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు పథకం, విద్య వంతులుకు (డిగ్రీ) ఉంటె పోస్టల్ లైఫ్ ఇన్సూ రెన్సు, ఇంట్లో ఆడపిల్లల పెళ్లి ల కోసం "సుకన్య సమృద్ధి యోజన" పథకం కింద ప్రజల ఆర్థిక స్థోమత బట్టి ఈ పథకంలో డబ్బులు దాచికొంటే ఆడ పిల్ల 21 సంవత్సరాలు దాటగానే లక్షల్లో డబ్బుతో పాటు వడ్డీ వస్తుందని ఈ పథకం కింద బాల్కొండ ప్రజలు ముందు చూపు తో ఇదే పోస్ట్ ఆఫీసులో ఖాతాలు ఓపెన్ చేయడం జరిగిందని ఆమె వివరించారు.

తపాలా సేవలు భేష్ - రాష్ట్ర కార్యదర్శి

దేశ స్వాతంత్రం తర్వాత నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత తపాలా శాఖలో పెను మార్పులు తీసుక వచ్చిదని,తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ యూత్ ప్రాజెక్ట్ యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్ దక్షిణ ఆసియా మైత్రి సదస్సు సెక్రటరీ సీనియర్ జర్నలిస్ట్ కాల మిస్ట్ బ్రహ్మరౌతు నర్సింగ్ రావు "భారత తపాలా కార్యాలయాల సేవల్ని అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేసారు. ప్రభుత్వ రంగా బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ అమలు చేయడం తో నేడు గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాకీంకుల్లో కి వెళ్లకుండా పోస్ట్ ఆఫీసుల్లో అధిక లాభాలు వచ్చే ఖాతా కోసం పోటీ పడుతు గ్రామీణ ప్రాంత ప్రజానికం తపాలా శాఖ వారి సేవల్ని వినియోగిస్తున్నారని నర్సింగ్ రావు వివరిస్తూ నేడు భారత దేశంలోని ప్రతి మారు మూల గ్రామంలో భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో సేవింగ్ బ్యాంక్స్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తో పాటు భారత తపాలా శాఖ పథకాలు బేషుగ్గా ఉన్నాయని పలు పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించు కుంటున్నారని యన్. వై. పీ సంయుక్త కార్యదర్శి డా,, డి. పవన్ కుమార్, సత్యావె సంతోష్ కుమారమార్ వివరించారు.

# లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

**- ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**తలకొండపల్లిలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన**

తలకొండపల్లి. ఆగస్టు 14, (విజన్ ఆంధ్ర): తలకొండపల్లిలోని శతాబ్ది సిల్వర్ స్ప్రింగ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్ కాసు శ్రీనివాస్ రెడ్డి గారి మాతృమూర్తి శ్రీమతి కాసు సీతమ్మ గారి జ్ఞాపకార్థం లయన్ అంజి రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం మానవతా సేవకు ప్రతీకగా నిలిచింది. కార్యక్రమం విజయవంతానికి లయన్ అంజి రెడ్డి సమన్వయంతో కృషి చేశారు.

ఈ సందర్భంగా లయన్ అంజి రెడ్డి మాట్లాడుతూ, "రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.

లయన్స్ సేవలు అభినందనీయం: ఎంపీ మల్లు రవి

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, "రక్తదానం అత్యంత విలువైన మానవతా సేవ. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవి. ప్రజా సేవలో లయన్స్ క్లబ్ చేస్తున్న కృషి ప్రశంసనీయం" అని అన్నారు.



ప్రజాసేవలో లయన్స్ క్లబ్ ముందంజ: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "ప్రజలకు అవసరమైన సమయంలో ముందుకు వచ్చి సేవ చేయడం లయన్స్ క్లబ్ ప్రత్యేకత. రక్తదాన శిబిరాలతో పాటు వివిధ వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న లయన్స్ సభ్యుల కృషి అభినందనీయం" అని పేర్కొన్నారు.

శ్రీమతి కాసు సీతమ్మ గారి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ద్వారా ఆమె స్మృతిని సేవా కార్యక్రమంతో కొనసాగించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేసినట్లు పి ఆర్ ఓ లయన్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ జంగయ్య, కొత్తపేట డిసిసిబి చైర్మన్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి నినాదాలతో మార్మోగిన కూకట్‌పల్లి

**– కేపీహెచ్‌బీ డివిజన్ లో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ డివిజన్‌లో 'హర్ ఘర్ తిరంగా' నినాదంతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ సీనియర్ నాయకులు ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఫోరం మాల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ జేఎన్టీయూ మీదుగా యూటర్న్ తీసుకుని తిరిగి ఫోరం మాల్ వరకు కొనసాగింది. చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకున్న విద్యార్థులు, బీజేపీ నాయకులు దేశభక్తి నినాదాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు హాజరై విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రతి ఇంటిలో దేశభక్తి స్ఫూర్తిని నింపడంతో పాటు దేశం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తుందని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రీతంరెడ్డి మాట్లాడుతూ
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడమే ర్యాలీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్ట్, షూ, పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ

తలకొండపల్లి, ఆగస్టు 14, (విజన్ ఆంధ్ర ) :తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వము నుండి వచ్చిన యూనిఫామ్,టై, బెల్ట్, షూ, విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీమా సుల్తానాతో కలిసి అందజేసిన గ్రామ సర్పంచ్ వాన రాశి రాములమ్మ, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద కుటుంబలకు చెందిన విద్యార్థిని ,విద్యార్థులు చదువుకుంటున్నారు.వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ, నాణ్యమైన దుస్తులు అందించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది అని అన్నారు.
కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి వెంకట్ రెడ్డి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు ముజీబూర్ రహమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ వార్డు సభ్యులు విశేఖర్ నాయకులు ఏ .వెంకట్ రెడ్డి , ఎస్.విజయ్ కుమార్, ఆరిఫ్, వి.వెంకటేష్, సి. హ్,విష్ణువర్ధన్ యాదవ్, వద్దే రాజు, దుబ్బ గణేష్, ఉపాధ్యా యులు, , ఏపీఎం రామస్వామి , సీసీ శ్రీశైలం, మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య,బుక్ కీపర్లు, మరియు గ్రామస్తులు, పాల్గొన్నారు



# హైదర్ నగర్ లోని 145 163 సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలి

**హైదర్ నగర్ లోని 145 163 సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలి**

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): 22 ఏ జాబితాలో చేర్చిన హైదరనగర్ గ్రామ సర్వే నంబర్లు 145, 163 లలోని భూముల్లో ఏర్పడిన సాయినగర్, భగత్ సింగ్ నగర్, వసంతనగర్, ఎస్ ఎస్ కాలనీ, సిబిసిఐడి కాలనీ, ఎన్ ఆర్ ఎస్ ఏ కాలనీ తదితర కాలనీల ప్రజలు తమ ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం మరో మారు మేడ్చల్ జిల్లా కలెక్టర్ దృష్టికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తీసుకువెళ్లారు. నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, లకు బహిరంగ సభ ద్వారా సమస్య తీవ్రతను వివరించారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రులు సానుకూలంగా స్పందించారు. దింతో వెంటనే శుక్రవారం నాడు కలెక్టర్ మను చౌదరి ని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. ప్రధానంగా ప్రభుత్వమే జి వో జారీ చేసి డబ్బులు కట్టించుకున్న ప్లాట్ లను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని, సుప్రీమ్ కోర్టు ఉత్తర్వులు, ఫైనల్ డిక్రీ లు ఉన్న స్థలాల్ని కూడా నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయాన్ని కలెక్టర్, ప్రభుత్వ అధినేత దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ముఖ్యమంత్రి ,దృష్టికి తీసుకువెళ్లి ఇల్లు, కాలనీలు ఉన్న ప్రాంతాలను మినహాయించే విధంగా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, వంతనగర్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు ఎం ఆర్ ఎస్ ఎ కాలనీ హనుమంతరావు , వెంకటరెడ్డి , లక్ష్మి నారాయణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ హైస్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక

**విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి చ. సౌజన్య,**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):
గాజులరామారం సీఎంఆర్ హైస్కూల్‌లో విద్యార్థుల నాయకత్వ ప్రతిభను ప్రోత్సహించే ఇన్వెస్టిచర్ వేడుక ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు ఈ సందర్భంగా బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ చ. సౌజన్య, హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఉదయ, క్రాంతి, వైస్ ప్రిన్సిపాల్ పి. మోహనరావు,పాల్గొని నూతన విద్యార్థి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.
విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు ధరింపజేసి, వివిధ బాధ్యతలను అప్పగించారు. అనంతరం వారు విధి నిర్వహణ ప్రమాణ స్వీకారం చేశారు. పాఠశాల నియమాలను పాటిస్తూ, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచి, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం, బాధ్యతాయుత




ప్రవర్తన, సమిష్టి కృషి,వంటి విలువలను అలవర్చుకోవాలని పాఠశాల యాజమాన్యం సూచించింది. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించింది. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తిని నింపింది.

## ఆదిత్య మెటర్నిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

**–ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**

తాండూరు, ఆగస్టు, 14( విజన్ ఆంధ్ర) తాండూరు పట్టణంలోని సాయిపూర్‌లో డా. భీంశెట్టి శరత్ చంద్ర, డాక్టర్ శ్రవణి లు నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆదిత్య వెటర్నరీ మల్టీస్పెషల్టి ఆస్పత్రి'ని ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి డా. శరత్ చంద్ర, శ్రావణి గార్లకు అభినందనలు తెలియజేస్తూ, తాండూరు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజా బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, పలువురు నాయకులు, నిర్వాహకులు చెన్నారం ఆనంద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి



**- రామన్నగూడ పాఠశాలలో విద్యార్థులకు షూస్, ఏకరూప దుస్తులు అందజేత**

చేవెళ్ల, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని రామన్నగూడ వార్డు కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్ సూచించారు. చేవెళ్ల మున్సిపల్ పరిధి రామన్నగూడ వార్డులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు షూస్, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు షూస్, ఏకరూప దుస్తులను అందజేశారు. విద్యతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం అందించిన షూస్, ఏకరూప దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 14 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో ఈ నెల ఐదవ తేదిన తేదిన మధ్యాహ్నం సమయంలో మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన శ్రీ సున్నం రవీందర్ రెడ్డి ఇంటి పైకప్పు సిమెంట్ రేకులను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి, బీరువాను పగలగొట్టి నలభై వేల నగదును కాసాని శివరాజు దొంగతనం చేశాడు. ఈ దొంగిలించిన కేసులో స్థానిక ఎస్ఐ లక్ష్మారెడ్డి మరియు సిబ్బంది కలిసి శుక్రవారం రోజున నేరస్తుడు అయిన కాసాని శివరాజు,గ్రామం మహమ్మదాపూర్‌ను పట్టుకోవడం జరిగిందని సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా అతని వద్ద నుండి నలభై వేల నగదు మరియు ఒక ఆటోను స్వాధీనం చేసుకుని, నిందితుడిని గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచడం జరిగిందన్నారు.ఇట్టి నేరస్తుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ లక్ష్మారెడ్డిని మరియు కానిస్టేబుల్ సంజీవ్ ని అభినందించారు.

## నట్టేట ముంచుతున్న నకిలీ ఎరువులు!

### ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని రైతుల దోపిడీ

### రూ.1,300 బస్తాకు రూ.1,650 వసూలు.. రసీదులో మాత్రం రూ.1,300!

### టీఎస్‌పీ వేసినా పంటలు ఎదగలేదంటున్న రైతులు

మర్పల్లి, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): అసలే కాలం కలిసి రాక, సకాలంలో వర్షాలు లేక పంటల సాగుతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎరువుల కొరత మరో సమస్యగా మారింది. మండలంలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎక్కడ దొరికితే అక్కడ కొనుగోలు చేస్తుండగా, ఇదే అదనుగా కొందరు వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తూ రైతులను నష్టాల్లోకి నెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్ నెలలో పంటలకు వేసేందుకు కోట మర్పల్లి గ్రామానికి చెందిన రైతులు మోమిన్ పేట్ మండలంలోని సైదుల్లాపూర్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో సుమారు 60 బ్యాగుల వరకు టీఎస్‌పీ ఎరువులు కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. వారిలో కావలి రాములు 26 బ్యాగులు, కాజా 20 బ్యాగులు, చిరంజీవి తదితర రైతులు టీఎస్‌పీ ఎరువులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

ఈ ఎరువులను పత్తి, కంది, సోయా, మొక్కజొన్న తదితర పంటలకు వినియోగించామని, అయితే ఎరువులు వేసిన తర్వాత కూడా పంటలు ఆశించిన స్థాయిలో ఎదగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము కొనుగోలు చేసిన టీఎస్‌పీ ఎరువుల నాణ్యతపై రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.1,300 బస్తాకు రూ.1,650 వసూలు?

టీఎస్‌పీ ఎరువు ఒక్కో బస్తా ధర రూ.1,300 ఉండగా తమ వద్ద రూ.1,650 చొప్పున వసూలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే తమకు ఇచ్చిన రసీదులో మాత్రం రూ.1,300 మాత్రమే నమోదు చేశారని రైతులు చెబుతున్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.మండలంలో ఎరువులు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన సమయంలో ఎరువులు దొరకకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.నకిలీ లేదా నాణ్యత లేని ఎరువుల కారణంగా పంటలు దెబ్బతింటే రైతులు పెట్టుబడులు కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతులు కొనుగోలు చేసిన టీఎస్‌పీ, యూరియా ఎరువుల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

# భార్య వ్యభిచారాన్ని ప్రాథమికంగా రుజువు చేస్తే మధ్యంతర భరణం ఇవ్వనక్కర్లేదు

## - సుప్రీంకోర్టు కీలక తీర్పు



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 14: భార్య వివాహేతర సంబంధంలో ఉందని ప్రాథమిక ఆధారాలతో భర్త రుజువు చేయగలిగితే, ఆమెకు మధ్యంతర జీవనభృతిని ఇవ్వాల్సిన అవసరం లేదని భారత సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది.

కేసు వివరాలు

రాజస్థాన్‌కు చెందిన హిమాంశు చోర్డియాకు 2014లో వివాహమైంది. మనస్పర్థల కారణంగా 2020లో భార్య బిడ్డతో కలిసి అత్తవారింటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఆమె సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద జీవనభృతి కోరుతూ కోర్టును ఆశ్రయించింది.

దీనిపై భర్త స్పందిస్తూ తన భార్య మరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని, అందుకు ఆధారంగా కొన్ని ఫోటోలు, ఇతర పత్రాలను కోర్టులో సమర్పించాడు. సీఆర్‌పీసీ సెక్షన్ 125(4) ప్రకారం వ్యభిచారం రుజువైతే భార్యకు జీవనభృతి హక్కు ఉండదని వాదించాడు.

కింది కోర్టుల వైఖరి

ట్రయల్ కోర్టు భర్త సమర్పించిన ఆధారాల ప్రామాణికతను ప్రధాన పిటిషన్ విచారణ చివర్లోనే తేల్చాలని చెబుతూ అతడి పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు కూడా మధ్యంతర భరణం దశలో ఈ అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం లేదని పేర్కొంది.

సుప్రీంకోర్టు ఏమంది?

హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ధర్మాసనం కింది కోర్టుల నిర్ణయాన్ని తప్పుబట్టింది.

భర్త తీసుకొచ్చిన ఆధారాలు భార్య వ్యభిచారాన్ని ప్రాథమికంగా నిరూపిస్తున్నప్పుడు, ఆ పిటిషన్‌ను మధ్యంతర దశలోనే విచారించి నిర్ణయం తీసుకోవాలని కోర్టు పేర్కొంది. అంతిమ తీర్పు వరకు వేచిచూడాలంటే సెక్షన్ 125(4) ఉన్న ఉద్దేశమే నిరుపయోగంగా మారుతుందని వ్యాఖ్యానించింది.

ఈ క్రమంలో కింది కోర్టుల ఉత్తర్వులను కొట్టివేస్తూ, భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను మెరిట్స్ ఆధారంగా మళ్లీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆ కేసును తిరిగి ట్రయల్ కోర్టుకు పంపింది.

గమనిక:

సీఆర్‌పీసీ సెక్షన్ 125(4) ప్రకారం భార్య వ్యభిచరిస్తున్నట్లు రుజువైతే ఆమెకు జీవనభృతి పొందే హక్కు ఉండదు.

# స్నాప్‌చాట్ మాయలో మహిళలు..

## 40 తులాల బంగారం కాజేసిన కేటుగాళ్లు

పేట్ బషీరాబాద్, ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర): సోషల్ మీడియా యాప్ స్నాప్‌చాట్‌ను వేదికగా చేసుకుని మహిళలను పరిచయం చేసుకుని, వారి నమ్మకాన్ని చూరగొని విలువైన బంగారు ఆభరణాలను కాజేస్తున్న ఇద్దరు నిందితులను పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్నేహం, పరిచయం పేరుతో మహిళలను ఆకర్షించి.. తాను ఆర్థికంగా ఎంతో ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తినని నమ్మించేందుకు అద్దెకు తీసుకున్న లగ్జరీ కార్లలో తిరుగుతూ నిందితుడు సాగర్ చౌదరి మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, పేట్ బషీరాబాద్ సీఐ విజయ్ వర్ధన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్, క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను పోలీసులు వెల్లడించారు.

స్నాప్‌చాట్‌లో పరిచయం.. నమ్మకం కలిగించి:

సంగారెడ్డికి చెందిన సాగర్ చౌదరి అలియాస్ సాయి సునీల్ (25) స్నాప్‌చాట్ ద్వారా మహిళలకు పరిచయమయ్యేవాడు. అనంతరం వారితో తరచూ చాటింగ్ చేస్తూ సన్నిహితంగా మెలిగి వారి నమ్మకాన్ని పొందేవాడని పోలీసులు తెలిపారు. తన వద్ద భారీగా డబ్బు ఉందని నమ్మించేందుకు అద్దెకు తీసుకున్న ఖరీదైన కార్లను వినియోగించేవాడని పేర్కొన్నారు.

ఆభరణాలపై కన్ను:

మహిళల పూర్తి నమ్మకాన్ని సంపాదించిన అనంతరం వారి వద్ద ఉన్న బంగారు గొలుసులు, ఉంగరాలు తదితర ఆభరణాలను గుర్తించి.. వాటిని తెలివిగా కాజేసి అక్కడి నుంచి వెళ్లిపోయేవాడని పోలీసులు తెలిపారు. అనంతరం తనకు సహకరించే రెండో నిందితుడు భరత్‌కుమార్‌కు చోరీ చేసిన బంగారాన్ని అప్పగించేవాడని వెల్లడించారు.

దొంగ బంగారానికి మార్కెట్ మార్గం:

రెండో నిందితుడు శివంగుల భరత్‌కుమార్ (28) వ్యాపార అనుభవాన్ని ఉపయోగించుకుని దొంగిలించిన బంగారు ఆభరణాలను మార్కెట్‌లో విక్రయించేందుకు సహకరించేవాడని పోలీసులు తెలిపారు. ఈ విధంగా ఇద్దరూ కలిసి పలువురు మహిళలను మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

20 మంది బాధితుల గుర్తింపు:

పోలీసుల ప్రాథమిక విచారణలో ఇప్పటివరకు 20 మంది బాధితులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిందితులు సుమారు 35 నుంచి 40 తులాల వరకు బంగారు ఆభరణాలను కాజేసి విక్రయించినట్లు విచారణలో అంగీకరించినట్లు పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్లు, ఆభరణాలు స్వాధీనం:

నిందితుల నుంచి బాధితులకు చెందిన బంగారు గొలుసులు, ఉంగరాలు తదితర ఆభరణాలతో పాటు నేరాలకు ఉపయోగించిన పలు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆధారాల ఆధారంగా దర్యాప్తును మరింత విస్తరిస్తున్నట్లు తెలిపారు.

ఇంకెంత మందో..?

ఈ ముఠా చేతిలో మోసపోయిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల సోషల్ మీడియా ఖాతాలు, మొబైల్ ఫోన్లను పరిశీలిస్తూ మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. స్నాప్‌చాట్ తదితర సామాజిక మాధ్యమాల్లో పరిచయం అయ్యే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.